AKHANDAA SURYAA

# అఖండ సూర్య

PRGI NO : APTEL/25/A4586

అజేయ ప్రజా స్వరం

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Vijayawada and Hyderabad

E-Paper:https://epaper.akhandasurya.com

సంపుటి : 01 సంచిక : 255 | విజయవాడ, ఆగష్టు, శనివారం 22, 2026 | పేజీలు : 12 వెల : 6.00



# షావుకారు జానకి కన్నుమూత

70 ఏళ్ల సినీ ప్రస్థానానికి ముగింపు

- ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూత
- వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస
- చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం మృతి
- 1950లో 'షావుకారు' సినిమాతో సినీరంగ ప్రవేశం
- తొలి సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న జానకి
- తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ చిత్రాల్లో నటన
- దాదాపు 380 చిత్రాల్లో నటించిన సీనియర్ నటి
- 70 ఏళ్లకు పైగా కొనసాగిన సినీ ప్రస్థానం
- 2023లో 'అన్నీ మంచి శకునములే'లో చివరిసారిగా కనిపించారు

అఖండసూర్య, విజయవాడ

తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె.. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 94 సంవత్సరాలు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో ఆమె భౌతికకాయాన్ని అభిమానులు, స్నేహితులు, సినీ పరిశ్రమకు చెందిన వారు నివాళులర్పించేందుకు ఉంచనున్నట్లు తెలిపారు.

**'షావుకారు'తో సినీ రంగ ప్రవేశం**

టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయా సంస్థ నిర్మించిన 'షావుకారు' సినిమాతో 1950లో సినీరంగ ప్రవేశం మిగతా 7లో..





## 29 నుంచి రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డు

# మూడో దశ పనులు

### ఈ నెల 29 నుంచి మూడో దశ పనులు ప్రారంభం

- వెల్లడించిన మంత్రి నారాయణ
- తుళ్లూరులో ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి
- ఆలయం నుంచి రైతులు చేపట్టిన
- పాదయాత్ర విజయవంతమైందని వ్యాఖ్య
- రాజధానిలో ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రధానంగా దృష్టి
- రైల్వే లైన్ నిర్మాణంపైనా వేగంగా పనులు
- ఆ తర్వాత విమానాశ్రయంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి
- ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటన
- రైతుల ప్లాట్ల అభివృద్ధి పనులకు ఈ నెల 27న టెండర్లు
- రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశ పనులు 29 నుంచి

అఖండసూర్య, విజయవాడ

అమరావతి రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ఆలయం నుంచి రైతులు చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా సాగిందని తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ పనుల తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని నారాయణ చెప్పారు. రాజధానిలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, ఇకపై ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు.

**రైతుల ప్లాట్ల అభివృద్ధికి టెండర్లు**

రైతులకు కేటాయించిన ప్లాట్ల అభివృద్ధి పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్లను ఈ నెల 27న తెరవనున్నామని చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.



## శ్రావణ శోభ

- ఘనంగా వరలక్ష్మీ వ్రతం
- అమ్మవారికి వినూత్న రీతిలో అలంకరణలు
- కూరగాయలు, కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ
- పసుపు కొమ్ములతో అమ్మవారి అలంకారం
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో నెలకొన్న రద్దీ
- సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు
- తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తుల రాక
- ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహణ
- శ్రావణ మాసంతో కళకళలాడుతున్న ఆలయాలు



అఖండసూర్య, విజయవాడ

శ్రావణ మాస శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో పండుగ శోభ సంతరించుకుంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. వరలక్ష్మీదేవికి కూరగాయలు, కరెన్సీ నోట్లు, పసుపు కొమ్ములతో వినూత్నంగా అలంకరణలు చేశారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు మిగతా 7లో..



## వివేకా హత్య కేసులో

# ఈడీ సోదాలు

- అవినాష్‌రెడ్డి నివాసంలోనూ తనిఖీలు
- ఏపీ, తెలంగాణలో ఏకకాలంలో ఈడీ సోదాలు
- హైదరాబాద్, పులివెందులలో మొత్తం ఆరు చోట్ల తనిఖీలు
- కోకాపేటలో అవినాష్‌రెడ్డి నివాసంలో సోదాలు
- పులివెందులలోని అవినాష్‌రెడ్డి ఇంట్లోనూ తనిఖీలు
- తాళం వేసి ఉండటంతో కొద్దిసేపు వేచి చూసిన అధికారులు
- అవినాష్‌రెడ్డి చిన్నాన్న మనోహర్‌రెడ్డిని పిలిపించి తాళం తెరిపించిన అధికారులు
- వివేకా హత్య కేసు నిందితుల ఇళ్లలోనూ సోదాలు
- సునీల్ యాదవ్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి ఇళ్లలో తనిఖీలు
- రూ.4 కోట్ల నగదు వ్యవహారంపై ఈడీ దృష్టి
- రాజకీయ ప్రమేయం, మనీలాండరింగ్ కోణాల్లో దర్యాప్తు

అఖండసూర్య, విజయవాడ

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి ఏపీ, తెలంగాణలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, కడప జిల్లా పులివెందులలో మొత్తం ఆరు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ కోకాపేటలో ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాసంలో హైదరాబాద్ ఈడీ జోనల్ కార్యాలయానికి చెందిన అధికారుల బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. అదే సమయంలో పులివెందులలోని అవినాష్‌రెడ్డి నివాసంలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. పులివెందులలోని ఇంటికి ఈడీ అధికారులు వెళ్లే సమయానికి తాళం వేసి ఉండటంతో కొద్దిసేపు బయటే వేచి ఉన్నారు. అనంతరం అవినాష్‌రెడ్డి చిన్నాన్న మనోహర్‌రెడ్డిని పిలిపించారు. ఆయన వచ్చి తాళం తెరిచిన తర్వాత అధికారులు ఇంట్లో సోదాలు ప్రారంభించారు. నిందితుల ఇళ్లలోనూ తనిఖీలు వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న సునీల్ యాదవ్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి నివాసాల్లోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా ఈడీ ప్రత్యేకంగా మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. హత్యకు ముందు జరిగిన మిగతా 7లో..

# ఆసుపత్రులకు రూ.221.67 కోట్లు

- కళాశాలల భవన నిర్మాణాలకు సైతం శ్రీకారం
- 12 చోట్ల పనుల ప్రారంభానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- ఇందులో 6 ఆయుష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, రెండు వైద్య కళాశాలలు
- మంత్రి శ్రీ సత్యకుమార్ వెల్లడి



అఖండసూర్య, విజయవాడ

రాష్ట్రంలో వైద్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయుష్ వైద్య సేవలు, వైద్య విద్యకు అవసరమైన భవనాల నిర్మాణంతో పాటు అల్లోపతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనపు వసతుల కల్పనకు మొత్తం రూ.221.67 కోట్ల అంచనా వ్యయంతో 12 పనులకు టెండర్లను పిలిచినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వీటిలో 10 పనులు ఆయుష్ విభాగానికి, రెండు పనులు అల్లోపతి వైద్య విభాగానికి సంబంధించినవి ఉన్నాయని ఓ ప్రకటనలో వెల్లడించారు. టెక్కలి నుంచి తిరుపతి వరకు.. ఆరు చోట్ల ఆయుష్ ఆసుపత్రులు జాతీయ ఆయుష్ మిషన్ (NAM) కింద ఆరు ప్రాంతాల్లో 50 పడకల సమీకృత ఆయుష్ మిగతా 7లో..

## జ్యుడీషియల్ సర్వీసుకు

# ప్రాక్టీస్ ఏడాదే

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం
- సివిల్ జడ్జి పోస్టులకు న్యాయవాద వృత్తి అనుభవం ఏడాదికి కుదింపు
- మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనపై సుప్రీంకోర్టు మధ్యేమార్గం
- 2027 ఏప్రిల్ 1 నుంచి ఏడాది ప్రాక్టీస్ తప్పనిసరి
- 2025 మే 20–2027 మార్చి 31 మధ్య నోటిఫికేషన్లకు మినహాయింపు
- ఆ కాలంలో ఫ్రెష్ లా గ్రాడ్యుయేట్లకూ అవకాశం
- ఎంపికైన వారికి ఏడాది జ్యుడీషియల్ అకాడమీ శిక్షణ
- ఆ తర్వాత ఏడాది లా క్లర్క్‌షిప్
- జిల్లా కోర్టు, హైకోర్టు జడ్జిల పర్యవేక్షణలో క్లర్క్‌షిప్
- శిక్షణ సమయంలో గౌరవ వేతనం
- యువ న్యాయవాదులు, మహిళలు, దివ్యాంగులకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశం



అఖండసూర్య, విజయవాడ

జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే న్యాయ విద్యార్థులు, యువ న్యాయవాదులకు సుప్రీంకోర్టు కీలక ఊరటనిచ్చింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కనీస న్యాయవాద వృత్తి మిగతా 7లో..

# సీజేపీ బృందంపై దాడి

### ఆశుతోశ్ రాంకా చొక్కా చింపిన నిరసనకారులు

- జైపూర్‌లో సీజేపీ బృందంపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి
- రాళ్లతో దాడి చేసి కార్యకర్తలకు గాయాలు
- కార్లు, ఫోన్లు ధ్వంసం చేసిన దుండగులు
- పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన బృందంపై దాడి
- గ్రామంలోకి ప్రవేశిస్తుండగా అడ్డుకున్న వ్యక్తులు
- సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు
- అర్బన్ నక్సల్స్, దేశద్రోహులు, పాకిస్థానీలంటూ ఆరోపణలు
- తన చొక్కా చింపేశారని ఆశుతోశ్ రాంకా ఆరోపణ
- ఓ బృంద సభ్యుడి చేయి విరిగిందని వెల్లడి
- దాడి వెనుక బీజేపీ నేతలున్నారన్న రాంకా ఆరోపణ



అఖండసూర్య, విజయవాడ

రాజస్థాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సహ వ్యవస్థాపకుడు ఆశుతోశ్ రాంకా బృందంపై దాడి జరిగింది. జైపూర్‌లోని రాంపురా కన్వర్‌పురాలో పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన సీజేపీ బృందాన్ని కొంతమంది వ్యక్తులు అడ్డుకున్నారు. అనంతరం రాళ్లతో దాడి చేయడంతో పాటు కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురు గాయపడినట్లు సమాచారం. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా ఆశుతోశ్ రాంకా తన బృందంతో కలిసి గ్రామానికి వెళ్లారు. వారు కాలినడకన గ్రామంలోకి ప్రవేశిస్తుండగా అప్పటికే అక్కడ వేచి ఉన్న కొంతమంది వ్యక్తులు వారిని అడ్డుకున్నారు. సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అర్బన్ నక్సల్స్, దేశద్రోహులు, పాకిస్థానీలంటూ ఆరోపణలు చేశారు. సీజేపీ బృందంలోని మహిళలు వారిని నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ పరిస్థితి అదుపు తప్పింది. ఆ గుంపు కార్యకర్తలపై దాడికి పాల్పడటంతో పాటు గ్రామంలోకి ప్రవేశించకుండా వెంటపడి తరిమికొట్టినట్లు సీజేపీ వర్గాలు మిగతా 7లో..



## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

- **టిడిపి ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి.**

**అఖండ సూర్య: ఆలూరు.**

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు.
శుక్రవారం ఆలూరు లోని టిడిపి పార్టీ క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు సమస్యలను వైకుంఠం జ్యోతి కి విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కారాని కై సంబంధిత అధికారులతో చర్చించి తొందరగానే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా వైకుంఠ జ్యోతి తెలిపారు. ఈ ప్రజా వినతుల స్వీకరణ గ్రీవెన్స్ డే కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సమస్యలను ఇంచార్జి వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడే నల్లమల సుంకులమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన.

**అఖండ సూర్య: ఆలూరు.**

ఆలూరు సంత మార్కెట్ లోని నల్ల మల సుంకులమ్మ వ్వ ఆలయంలో శనివారం విఘ్నేశ్వర, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట,ధ్వజస్తంభ మరియు గోపుర కలశ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మెలిగనూరు మఠం, పాల్తూరు చన్న వీర శివాచార్య మహా స్వాముల వారిచే విగ్రహాల ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం, హ త్తిబెలగల్ సిద్ధయ్య స్వామి, బిలేహాళ్ మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



## ఆళ్లగడ్డ లో మెగా సంబరాలు..

- **ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, డాక్టర్ మెగా స్టార్ చిరంజీవి జన్మదినసందర్భంగా బ్రెడ్డుపంపిణీచేసినయూత్ ఫోర్స్....**

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి ,,**

ఆళ్లగడ్డ పట్టణము లో ప్రముఖ సినీనటుడు పద్మభూషన్ అవార్డు గ్రహీత చిరంజీవి జన్మ దిన వేడుకలుఅత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆళ్లగడ్డనియోజకవర్గమెగాయూత్ ఫోర్స్ కన్వీనర్ పసులనరేంద్ర ఆధ్వర్యంలో ఈ సేవాకార్య క్రమములు నిరంతరము కొనసాగుతున్నాయి. మెగాస్టార్ ఆశయాలకుఅనుగుణంగా, సమాజసేవలక్ష్యంగా ఈ వేడుకలను మూడురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ జన్మదిన వేడుకలలో భాగంగా రెండవ రోజు శుక్ర వారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్న రోగులకు మరియు గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు వారికిఅందుతున్న వైద్య సేవలవివరాలను ఆరా తీశారు.మూడురోజుల వేడుకలలో భాగంగా రేపు శనివారంముగింపు కార్యక్రమంసందర్భంగా కేక్ కట్ కటింగ్అన్నదాన కార్య క్రమాలునిర్వహిస్తున్నట్లు మెగాయూత్ ఫోర్స్ నాయకులు తెలిపారు.







# అహోబిలం క్షేత్రంలో వైభవంగా శ్రీ వరలక్ష్మీ వ్రతము...తిరుమలలో ఉత్సవం....

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి**

శ్రీ అహోబిల మఠం పరంపరాగత అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ అహోబిల మహాక్షేత్రంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం ఉదయం 10.00 గంటలకు శ్రీ అమృతవల్లి అమ్మవారికి నవ కలశ పూర్వక పంచామృతాభిషేకంను ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఆలయప్రాకారంలో ఉత్సవం జరిగింది.అనంతరరంగ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు అమ్మవారి ప్రసాదాన్నిఅందజేశారు. ఈకార్యక్రమంలో అహోబిలం దేవస్థానం అధికారులు, అహోబిలలంమఠం అధికారులు, ఆలయ మణియార్ సౌమ్య నారాయణ్,అర్చక స్వాములు పాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.







## ఆలూరు గాంధీనగర్ లో ఇంటింటికి తెలుగుదేశం ప్రచారం

**అఖండ సూర్య: ఆలూరు:**

ఆలూరు పట్టణం లోని గాంధీ నగర్ లో శనివారం టిడిపి నాయకులు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని, టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి అడిగి తెలుసుకుంటున్నారు. అలాగే ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలూరు టౌన్ యూనిట్ సభ్యులు చిన్నంగి నరసప్ప, 174 బూత్ కన్వీనర్ చెన్నంగి రంగయ్య, కోకన్వీనర్ ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదులో జరిగిన వివాహ వేడుకల్లో మాజీ సి.యం. వై.యస్.జగన్ నుకలిసిన మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంధారెడ్డి.....

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి,,**

హైదరాబాద్‌లోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో జరిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు గారి కుమారుని వివాహ వేడుకలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఏ.పి. మాజీ సి. యం.వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారిని,ఆళ్లగడ్డ మాజీ,ఎమ్మెల్యే గంగుల జేంధా రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.



## దిగువ అహోబిలంలో శ్రీ సరస్వతీ విద్యా మందిరం లో ఘనంగా శ్రీ వరలక్ష్మి వ్రతం...

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి,,**

ప్రముఖ పుణ్య క్షేత్ర మైనదిగువ అహోబిలం గ్రామంలో శుక్రవారం నాడు శ్రీ సరస్వతి విద్యా మందిరంలో శ్రీవరలక్ష్మి వ్రతం ను అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు , శ్రీ సరస్వతి విద్యా మందిరం పాఠశాల అధ్యక్షులు కీడాంబి వేణుగోపాలచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతం పాల్గొన్నారు.




## కె నాగలాపురంలో సామూహిక వరలక్ష్మి వ్రతం

**అఖండ సూర్య,గూడూరు:**

మండల పరిధిలోని కె నాగలాపురం గ్రామంలోని గ్రామ దేవత శ్రీ సుంకుల పరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం సుంకులాపరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం నందు శ్రావణ లక్ష్మి సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.. వివిధ గ్రామాల చెందిన ముత్తయిదులు వరలక్ష్మి వ్రతం లో పాల్గొని పూజ కార్యక్రమం నిర్వహించారు.. ఆలయ అధికారులు వరలక్ష్మి వ్రత సంబంధించి పూర్తి సామాగ్రి పూజ వస్తువులను అందించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమం లో మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని వ్రతం ఆచరించారు. ఈ కార్యక్రమం లో ఆలయ వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి. ఆలయ కమిటీ సభ్యులు తలారి సుజాత,బండారి లక్ష్మి దేవి, కురువ వెంకట రాముడు,చాకలి మద్దమ్మ. మంగలి లక్ష్మి దేవి పాల్గొనారు. ఆలయ ఈఓ రాధా కృష్ణ, క్లర్కు కేశవ్, తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే మా లక్ష్యం

- **జనసేన ఇంచార్జ్ వెంకప్ప**

**దేవనకొండ,( అఖండ సూర్యప్రతినిధి )**

ఆలూరు నియోజకవర్గం లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే మా లక్ష్యమని ఆలూరు జనసేన ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. వచ్చే సంవత్సరం వేసవికాలంలో చేపట్టాల్సిన స్వల్పకాలిక చర్యలు, రాబోయే 3 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక,
దీర్ఘకాలిక శాశ్వత తాగునీటి పరిష్కారాలు, అవసరమైన నిధుల సమీకరణకు సాధ్యమైన మార్గాలు, మండలాల వారీగా సమస్యలకు ప్రాధాన్యత క్రమం ఆధారంగా సమగ్ర నివేదికను త్వరితగతిన సిద్ధం చేసి, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి సమర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. ఆలూరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో కాకుండా, శాశ్వత చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.







# శ్రీశైలం మహా క్షేత్రంలో శ్రావణ శుక్రవారం వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతములు

- **ధర్మప్రచారంలో భాగంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు.**
- **సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన 1800 మంది పైగా భక్తులు.**
- **వ్రతములో పాల్గొనవారందరికీ చీర, రవికవస్త్రం, వృక్ష ప్రసాదం అందజేత.**
- ***వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం మరియు అన్నప్రసాదాల ఏర్పాట్లు.**

**శ్రీశైలం అఖండ సూర్య:-**

వరలక్ష్మీవ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించింది. ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణమండపంలో ఈ ఉచిత సామూహికవ్రతాలు నిర్వహించబడ్డాయి. 1800 మందికి పైగా భక్తులు ఈ వ్రతాన్ని జరిపించుకున్నారు. కాగా ఈ వ్రతాలకు కావలసిన పూజాద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. వ్రతకార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికోసం వేరువేరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా ఈ వ్రతం జరిపించబడింది. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వ్రతంలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించబడింది. తరువాత వేదికపై వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి. అనంతరం వరలక్ష్మీవ్రతంలో భాగంగా భక్తులందరిచేత విడివిడిగా కలశస్థాపన చేయించి వరలక్ష్మీదేవివారిని సమంత్రకంగా ఆవాహన చేయడం జరిగింది. తరువాత శ్రీసూక్తవిధానంలో వ్రతకల్పపూర్వకంగా వరలక్ష్మీదేవివారికి షోడశోపచారపూజలు జరిపించబడ్డాయి. అనంతరం అర్చకస్వాములు వ్రతకథను పఠించి వ్రతమహిమావిశేషాలను భక్తులకు తెలియజేశారు. చివరగా నీరాజన మంత్రపుష్పాలను జరిపి వ్రతసమాప్తి చేయబడింది. వ్రతాన్ని జరిపించుకున్న వారందరికీ, చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, కంకణాలు, వృక్షప్రసాదంగా తులసి మొక్క, పుస్తక ప్రసాదంగా శ్రీశైలప్రభ మాసపత్రిక, మూడు రకాల ప్రసాదాలు అందజేయబడ్డాయి. వ్రతానంతరం భక్తులందరికీ ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించబడింది. దర్శనానంతరం దేవస్థానం అన్నపూర్ణ భవనం నందు భక్తులందరికీ అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి.
కాగా భక్తులందరూ వ్రతక్రియను సౌకర్యవంతంగా వీక్షించేందుకు వీలుగా చంద్రవతి కల్యాణమండపంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డి స్క్రీనును కూడా ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ మన వైదికసంప్రదాయంలో శ్రావణ మాసాన వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించడం సంప్రదాయంగా వస్తున్నదని అన్నారు. ఈ శ్రావణమాసం సర్వదేవతా ప్రీతికరంగా చెప్పబడుతోందన్నారు.
ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దేవస్థానం ఈ వరలక్ష్మీవ్రతాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనడం



ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. జ్యోతిర్లింగస్వరూపుడైన శ్రీమల్లికార్జునస్వామివారు మహాశక్తి స్వరూపిణి శ్రీభ్రమరాంబాదేవివారు స్వయంవ్యక్తంగా వెలసిన శ్రీశైలమహాక్షేత్రంలో వరలక్ష్మీవ్రతాన్ని జరిపించుకునే వారందరు కూడా ఎంతో అదృష్టవంతులన్నారు. అందరికీ శ్రేయస్సు కలుగుతుందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ధర్మకర్తల మండలి వారి సూచనల మేరకు భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు.








## ఆళ్లగడ్డ శ్రీ భారతీ విద్యామందిరం శాఖా పాఠశాల లో నూతన శ్రీ సరస్వతీ మాతవిగ్రహ ప్రతిష్ట, శ్రీ వర లక్ష్మీ వ్రతము...

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి,,**



ఆళ్లగడ్డ పట్టణము లోని శ్రీ భారతీ విద్యామందిరం శాఖా పాఠశాలలో శుక్రవారం నాడు శ్రీ సరస్వతీ మాత నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మరియు శ్రీ వర లక్ష్మీ వ్రతము ను మహిళలు సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జిల్లా జడ్జికాశీ భట్ల శివ ప్రసాద్ గారిచే భగవద్గీత పారాయణం కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్య క్రమంలో పాఠశాల కార్య దర్శి ఆర్.సత్య ప్రసాద్, ప్రబంధ కారిణీ సభ్యులుగుండా హరి ,ఆర్ .రాధాకృష్ణ బ్రరెంకల పుల్లయ్య, ముని రామకృష్ణ, బి.ఓబుల రెడ్డి, పెద్ద ఎత్తున మహిళలుపాల్గొన్నారు. పాఠశాలకు శ్రీ సరస్వతీ దేవి విగ్రహాదాత కీ..శే..అడ్వకేట్ శిల్పి అన్నయ్యచారి సతీమణి ఎన్. లక్ష్మి దేవి పాల్గొన్నారు.



## శ్రీశైలం దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు విధుల నుంచి తొలగింపు

- **దేవస్థానం విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేసిన కార్యనిర్వహణాధికారి**

**శ్రీశైలం అఖండ సూర్య :-**



శ్రీశైలం దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బి.శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తూ ఈవో ఎం. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు శ్రీశైలం సీఐ,సీఎస్ఓ మధ్య గత 7 నెలల క్రితం ఫోన్ లో లా అండ్ ఆర్డర్ పై ఆలయం మూసిన తర్వాత శ్రీశైలం సిఐ ఆలయం లోపలికి వెళ్లారని అలా వెళ్లకూడదని సిఎస్ఓ సిఐతో సంభాషణ వివాదంగా మారింది అది కాస్తా ఈనెల 12 వతేదీన సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈవిషయంపై విచారణ చేపట్టిన ఈవో శ్రీనివాసరావు నిబంధనలు అతిక్రమించి గత 7 నెలల క్రితం జరిగిన ఆడియో సిఎస్ఓ లీక్ చేసినట్లు తెలియడంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది దేవస్థానం పవిత్రతకు భంగం వాటిల్లేలా సిఎస్ఓ తీరుపై సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో సీఎస్ఓని శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ప్రస్తుతం సిఎస్ఓగా ఇంచార్జ్ బాధ్యతలను దేవస్థానం పర్యవేక్షకుడు ఎం. మల్లికార్జునకు అప్పగించారు

## రేషన్ డీలర్లకు పనికి తగ్గ పరిహారం ఇవ్వాలి

- **మంత్రి నాదెండ్ల మనోహర్ ను కోరిన రేషన్ డీలర్లు**

**అఖండ సూర్య:ఆలూరు:**

రేషన్ డీలర్లకు పనికి తగ్గ పరిహారం అందించాలని, ప్రస్తుతం ఇస్తున్న కమిషన్‌కు అదనంగా రూ.3 పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలసి కోరినట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగలి రంగయ్య తెలిపారు. శుక్రవారం
రాష్ట్ర సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరిజారావు అద్వర్యం లో వివిధ జిల్లాలకు చెందిన రేషన్ డీలర్ల ప్రతినిధులు కలిశారు.
రేషన్ డీలర్లకు నిర్వహణ ఖర్చులతో కూడిన శాశ్వత ఆదాయం రూ.50 వేలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అది సాధ్యం కాకపోతే ప్రస్తుతం ఉన్న కమిషన్‌ను మరో రూ.3 పెంచి డీలర్లకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.
విధి నిర్వహణలో మృతి చెందిన రేషన్ డీలర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డుల్లో ఉన్న హెచ్చుతగ్గులను సరిచేసి, డీలర్లందరికీ సమానంగా అలాట్‌మెంట్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రేషన్ డీలర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. మంత్రిని కలసిన వారిలో డీలర్లు ఆంజనేయులు, చెన్నంగి హనుమప్ప, కె. శేషిరెడ్డి, చిప్పగిరి బి. రాఘవేంద్ర ఉన్నారు.



## ఆళ్లగడ్డలోని తమ నివాసంలో శ్రీ వర లక్ష్మీ వ్రతం చేస్తున్న ఎమ్మెల్యేభూమాఅఖిలప్రియ..

**అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి,,**



శ్రావణ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఈరోజు భూమా అఖిలప్రియ గారి నివాసంలో శ్రీ వరలక్ష్మీ దేవి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆడపడుచులకు తాంబూలాలు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ మహాలక్ష్మి అనుగ్రహంతో మన ఆళ్లగడ్డ ప్రజలందరి ఇళ్లలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నిండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించానని ఆళ్లగడ్డ ఎమ్మెల్యేభూమాఅఖిలప్రియ పేర్కొన్నారు. కనుక అందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు ఆళ్లగడ్డ ఆమె తెలియజేశారు.






## డి ఏ టి సి యు వారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

**జూపాడు బంగ్లా అఖండ సూర్య న్యూస్**

జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంబస్టాండు ఆవరణలొ విజయ మహిళా మండలిఐటిసి వారి ఆధ్వర్యంలో ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెడికల్ క్యాంపును నిర్వహించారు
రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాం దృష్టిలో ఉంచుకొని ప్రజల వద్దకు ఆరోగ్య సేవలు అందించాలని లక్ష్యంతో ఈ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారని. హెచ్ఐవి. బిబి .షుగర్. బ్లడ్ లో ఇన్ఫెక్షన్. ఇలాంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ సేవలు వినియోగించుకోవాలని మెడికల్ క్యాంపు సూపర్వైజర్ నరసింహ. ఏఎన్ఎం సంతోషమ్మ ఓఆర్ డబ్ల్యు అరుణ. కౌన్సిలర్ మల్లికా. ఎం బాలాజీ. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు



# సంపాదకీయం



## వందేమాతరం తీవ్ర దుమారం

భారత జాతీయ గేయం వందేమాతరం చుట్టూ మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది న్యూఢిల్లీలో నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో, భవిష్యత్‌లో పార్టీ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే బీజేపీ కాంగ్రెస్‌ను లక్ష్యంగా పదునైన విమర్శలతో దాడి చేసింది. ఈ వివాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తమిళనాడులోని చెంగల్పట్టులో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ ప్రయోజనాలను, జాతీయ భావాలను తాకట్టు పెడుతోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిర్ణయం కేవలం రాజకీయ స్వార్థంతో కూడుకున్నదని, ఇది దేశ విభజనకు పునాది వేసిన నాటి విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపీప జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ కాంగ్రెస్‌ను ఏకంగా కొత్త ముస్లిం లీగ్‌తో పోల్చారు. పార్లమెంట్ చేసిన చట్టాన్ని ధిక్కరిస్తూ కాంగ్రెస్ తన పాత విధానాలనే అమలు చేయాలని చూడటం విచారకరమని విమర్శించారు. దేశం గతంలో ఒకసారి వందేమాతరాన్ని రెండు భాగాలుగా విభజించే తప్పును అంగీకరించి తీవ్ర పరిణామాలను ఎదుర్కొంది. ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మళ్లీ అదే విధమైన రాజకీయాలను ముందుకు తీసుకెళ్తోంది. వందేమాతరాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీని, స్వాతం□త్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను కాంగ్రెస్ అవమానిస్తోంది." అని అమిత్‌షా అన్నారు. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోషల్ వి□డియా వేదికగా సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. " దేశం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన వేలాది మంది అమరవీరులు ఈ వందేమాతర గేయాన్ని తమ శ్వాసగా మార్చుకొని పోరాడారు. అటువంటి పవిత్ర గేయాన్ని అవమానించడాన్ని కాంగ్రెస్ ఇప్పుడు తన అధికారిక పాలసీగా మార్చుకుంది" అని నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశ ఆత్మగౌరవాన్ని ఓటు బ్యాంకు రాజకీయాల వద్ద తాకట్టు పెట్టారని, అందుకే నేటి కాంగ్రెస్ సరికొత్త ముస్లిం లీగ్‌గా అవతరించినట్టు కామెంట్ చేశారు. ఈ వివాదం ఆగస్టు 15 వేడుకల సందర్భంగా మొదలైంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ వి□డియాలో వైరల్ అయ్యింది. ఆ సమయంలో ఎంపీ సోనియా గాంధీ వందేమాతరం పూర్తి గేయాన్ని పాడకుండా నిలిపివేయడానికి ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. అయితే కాంగ్రెస్ ఈ ఆరోపణలను ఖండించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూర్చోవడానికి కుర్చీ వేయమని మాత్రమే సోనియా గాంధీ అడిగారని వివరణ ఇచ్చింది. అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య వందేమాతరం ఆలపించడంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వివాదానికి మ□లాలు దాదాపు 9 దశాబ్దాల క్రితం నాటి కాంగ్రెస్ తీర్మానం. కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ తాము కొత్తగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని 1937 నాటి కాంగ్రెస్ చారిత్రక కమిటీ సిఫార్సులనే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వందేమాతరం గేయాన్ని బంకిం చంద్ర చటోపాధ్యాయ 1875లో సంస్కృతం, బెంగాలీ భాషల్లో రాశారు. ఇది మొదట 1875 నవంబర్ 7న బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత 1881లో ఆయన రాసిన ఆనందమఠ్ నవలలో చేర్చారు. ఈ నవల బెంగాల్ ప్రాంతం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు బ్యాక్‌గ్రౌండ్‌లో సాగుతుంది.

1905 నాటి స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం భారతీయుల ప్రధాన సమరనాదంగా మారింది. అయితే 1937 అక్టోబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష చంద్రోస్‌కు రాసిన లేఖలో వందేమాతరం నవల ముస్లింలలో కొన్ని ఆందోళలను కలిగిస్తోందని పేర్కొన్నారు. అదే సమయంలో ఈ అభ్యంతరాలు అధిక శాతం మతోన్మాధులు సృష్టించినవని కూడా నెహ్రూ అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయాన్ని కోరారు. ఠాగూర్ ఈ గేయంలోని మొదటి రెండు చరణాలను, మిగిలిన చరణల నుంచి వేరు చేసి చూడాలని సూచించారు. ఠాగూర్ ఇచ్చిన ఈ సలహాతో 1937 అక్టోబర్‌లో మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, వల్లభాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ వంటి ప్రముఖులతో కూడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక కీలక తీర్మానం చేసింది. జాతీయ సభలలో వందేమాతరాన్ని ఆలపించేటప్పుడు కేవలం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని ఆ తీర్మానంలో సిఫార్సు చేశారు. గాంధీ కూడా 1939 జులై నాటి హరిజన్ పత్రికలో వ్యాసం రాస్తూ... స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం హిందూ` ముస్లింలను ఏకం చేసిన గొప్ప సమరనాదం అని పేర్కొన్నారు. కానీ, దీనిని బలవంతంగా రుద్దడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఎవరైనా అభ్యంతం చెబితే సదస్సుల్లో పాడటం నిలిపివేయవచ్చని, వివాదాలకు తావు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. వందేమాతరం పూర్తి గేయం మొత్తం ఆరు చరణాలు ఉన్నాయి. జాతీయ గేయంగా అధికారిక హోదా పొందిన కేవలం మొదటి రెండు చరణాలు మాత్రమే. ఇందులో దేశ ప్రకృతి అందాలు, నదీ జలాలు, పచ్చనని పంట పొలాలు, ఫలసాయాన్ని వర్ణిస్తూ మాతృభూమికి ప్రణామాలు అర్పిస్తారు. దీనిపై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. కానీ 3,4, 5, 6 చరణాల చుట్టూ వివాదాలు నడుస్తున్నాయి. మ□డో చరణంలో మాతృభూమి రక్షణ కోసం కోట్ల కొద్ది చేతులు కత్తులు పట్టుకొని సిద్ధంగా ఉన్నాయని యుద్ధ సంకేతాలు ఇస్తుంది. నాల్గో ఐదో చరణాలు మాతృభూమిని దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీ దేవీ హిందూ దేవతలతో పోల్చి పూజిస్తారు. ముస్లిం అభిప్రాయం ప్రకారం ఇస్లాంలో కేవలం అల్లా తప్ప మరెవరినీ పూజించకూడదు. మాతృభూమిని దేవతగా ఆరాధించడం ఇస్లాం సిద్ధాంతాలకు విరుద్ధమని వారి వాదన. ఈ వివాదం ఈనాటిది కాదు. గత ఏడాది డిసెంబర్‌లో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా పార్లమెంటులో చర్చ జరిగింది. లోక్‌సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... నెహ్రూ ముస్లీం లీగ్ ఒత్తిడికి తలొగ్గి వందేమాతరాన్ని కుదించారని ఆరోపించారు 1937లో జిన్నా అభ్యంతరం చెప్పినప్పుడు నెహ్రూ దీనిపై వెనక్కి తగ్గారని మోదీ విమర్శించారు. దీనికి కౌంటర్‌గా ప్రియాంకా మాట్లాడుతూ.. నెహ్రూ రాసిన లేఖలోని పూర్తి భాగాలను ప్రస్తావించారు. ముస్లిం లీగ్ చేస్తున్న ఆందోళనలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని నాడే చెప్పారని గుర్తు చేశారు. అదే సమయంలో వందేమాతరాన్ని బలవంతంగా రుద్దడం మంచిది కాదని విపక్షాలు అభిప్రాయపడ్డాయి. వందేమాతరాన్ని అవమానించం లేదా దాని ఆలాపనను అడ్డుకోవడాన్ని పార్లమెంట్ నేరంగా పరిగణిస్తూ చట్టాన్ని తెచ్చింది. అనంతరం కేంద్రప్రభుత్వం జాతీయ గేయానికి సంబంధించి తొలిసారిగా అధికారిక ప్రోటోకాల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయంలోని మొత్తం ఆరు చరణాలను ఆలపించడాన్ని తప్పనిసరి చేసింది. కేంద్రం తెచ్చిన కొత్త రూల్స్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో ఆరు చరణాలు పాడాల్సి ఉండగా, కాంగ్రెస్ తన సొంత పార్టీ వేడుకల్లో మాత్రం మొదటి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించుకుంది. ఈ వివాదం భవిష్యత్‌లో మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది

## వివేకా హత్య కేసు విచారణ.. సీబీఐ కోర్టుకు హాజరుకాని ఎంపీ అవినాష్ రెడ్డి

హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టులో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ జరిగింది. ఈ విచారణకు నిందితుడు వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి హాజరుకాలేకపోయారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించిన నేపథ్యంలో ఆయన కోర్టుకు దూరంగా ఉన్నారు. మరో నిందితుడు వైఎస్ భాస్కర్ రెడ్డి సైతం విచారణకు హాజరుకాలేదు. అయితే హాజరుకాని వారి తరఫు న్యాయవాదులు వినతిపత్రాలు సమర్పించారు. ఇదే కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డిలతో పాటు డి.టి. రేవంత్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి కోర్టుకు నేరుగా హాజరయ్యారు. ఇరుపక్షాల వాదనలు, నిందితుల హాజరు అంశాలను పరిశీలించిన సీబీఐ న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. తదుపరి కార్యాచరణ, సాక్షుల విచారణపై ఆ రోజు కోర్టు నిర్ణయం తీసుకోనుంది.

# ఏపీలోనూ 22 ఏ ప్రకంపనలు

**విజయవాడ, అఖండ సూర్య**

మాజీ ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ పూర్వ అధిపతి ఏబీ వెంకటేశ్వరరావు ఇటీవల ఏపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా 22ఎ నిషేధిత భూముల జాబితా పరిరక్షణ ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన వేధింపులకు, సస్పెన్షన్‌కు గురై సత్యమేవ జయేతే అంటూ పోరాడిన ఆయన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోకి చేరకపోవడం, పైగా పాలనా లోపాలపై గళమెత్తడం వెనుక అసలు ప్లాన్ ఏంటనేది ఆసక్తికర చర్చకు దారితీసిందిఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ పార్టీలోకి చేర్చుకోనందుకే ఆయన అసంతృప్తితో విమర్శలు చేస్తున్నారు. తాను టీడీపీలో చేరాలని గతంలో అనుకున్నప్పటికీ సరైన స్పందన రాలేదని ఆయనే పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినా ఆయన తీసుకోలేదు. అందుకే ఆ తర్వాత ఆయన మరికొంత మంది ఇతరులతో కలిసి సెంటర్ ఫర్ లిబర్టీ అనే వేదిక ద్వారా 22ఎ నిషేధిత భూముల జాబితా కారణంగా నష్టపోతున్న లక్షలాది మంది ప్రజల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ స్థాయి నేతలకు అధికారుల వాస్తవాలు సరిగ్గా చేరవేడం లేదని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ భూముల సమస్య ప్రజా ఉద్యమంగా మారడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఆయుధంగా దీనిని మలుచుకున్నారు. రోల్ బ్యాక్ 22ఎ పేరుతో ఉద్యమం చేస్తున్నారు. ఇక సొంత పార్టీ ఏర్పాటు ప్రకటన విషయానికి వస్తే, ఏబీ వెంకటేశ్వరరావు తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదో ఒక రాజకీయం వెనుక నడవడం కంటే సమాజంలో మార్పు కోసం, పౌర హక్కుల పరిరక్షణ కోసం తమ భావసారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని ప్రకటించారు. అధికారం పొందేందుకు కాకపోయినా, ఒక బలమైన వాచ్‌డాగ్‌గా, ఒత్తిడి గ్రూప్‌గా పనిచేయడానికే ఈ నూతన వేదిక ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.




తెలుగుదేశం పార్టీ ఇలాంటి మాజీ అధికారులను , సానుభూతిపరులను ఎందుకు దూరం చేసుకుంటోందనే ప్రశ్నకు రాజకీయ వ్యూహాలే సమాధానంగా కనిపిస్తున్నాయి. మాజీ అధికారుల స్వేచ్ఛా ప్రకటనలు ప్రభుత్వ నిర్ణయాలకు అవరోధంగా మారడం, లేదా పార్టీకి క్యాడర్ ఆధారిత నాయకత్వమే ప్రాధాన్యత కావడం ఇందుకు కారణం కావచ్చు. అదే సమయంలో, సుదీర్ఘకాలం ఇంటెలిజెన్స్ వైపు పనిచేసిన అనుభవం ఉన్న వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని నియంత్రించే లోపాలను పసిగట్టి వేలెత్తి చూపిస్తుండటంతో కూటమి సర్కారుకూ ఇది ఇబ్బందికరంగా పరిణమించింది. తన చట్టపరమైన పోరాటం ముగిసిన తర్వాత, సమాజంలో ఒక ఇండిపెండెంట్ లీడర్‌గా, ప్రజా సమస్యలపై పోరాడే సివిల్ సొసైటీ వాయిస్‌గా తనను తాను నిలబెట్టుకునేందుకు వేస్తున్న వ్యూహాత్మక అడుగుగా దీనిని చూడొచ్చు.

# పొలిటికల్ ఆడిటింగ్ పూర్తి ?

- **విజయసాయిరెడ్డి పార్టీ టార్గెట్ ఇదే !**

**నెల్లూరు,, అఖండ సూర్య**

రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు.రాజకీయ సన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి.. ఇప్పుడు అనూహ్యంగా తిరుమల శ్రీవారి సాక్షిగా సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటును ప్రకటించారు. ఈ నెలలోనే విజయవాడ వేదికగా పార్టీ పేరు, జెండా, విధివిధానాల రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తానని ఆయన వెల్లడించారు. అయితే, వైఎస్సార్‌సీపీలో నంబర్ టూగా చక్రం తిప్పి, దేశంలోనే అగ్రశ్రేణి ఆడిటింగ్ మాస్టర్‌గా పేరొందిన విజయసాయిరెడ్డి.. కేవలం ప్రజాసేవ కోసమే కొత్త దుకాణం తెరుస్తున్నారంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. రాజకీయాల్లో సొంత పార్టీ నడపడం అంటే ఆర్థికంగా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారమని తెలిసినా ఆయన ఈ అడుగు వేస్తున్నారంటే, ఆ పెట్టుబడి వెనుక అంతకుమించిన భారీ ప్రయోజనాలు, సరికొత్త లెక్కలు దాగి ఉన్నాయని స్పష్టమవుతోంది.ఈ సరికొత్త రాజకీయ ప్రయోగం వెనుక ప్రధానంగా వినిపిస్తున్న వాదన వ్యక్తిగత, వ్యాపార రక్షణ కవచం . గత ఐదేళ్ల పాలనలో విశాఖపట్నం భూముల వ్యవహారాలు, దసపల్లా భూ వివాదాలు, లిక్కర్ లావాదేవీలు, అనేక ఆస్తుల క్రయవిక్రయాల్లో ఆయనపై లెక్కలేనన్ని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫైళ్లు తిరగదోడే ప్రమాదం ఉండటం, మరోవైపు సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసుల విచారణలు కొనసాగుతుండటంతో.. కేవలం సాధారణ పౌరుడిగా ఉంటే చట్టపరమైన ఉచ్చు బిగుస్తుందన్న భయం ఆయనను వెంటాడుతోందన్న ప్రచారం ఉంది. రేపు ఏ విచారణ సంస్థ దర్యాప్తు చేపట్టినా, రాజకీయ కక్షసాధింపు , కొత్త పార్టీ పెట్టినందుకే వేధింపులు అనే ముద్ర వేసి ప్రజాక్షేత్రంలో సానుభూతి పొందడానికి ఒక రాజకీయ పార్టీ హోదాను రక్షణ కవచంగా వాడుకోవాలన్నదే ఆయన మొదటి వ్యూహం కావొచ్చు.మరో బలమైన రాజకీయ కోణం బీజేపీ పెద్దల గేమ్ ప్లాన్ . ఢిల్లీలోని కమలనాథులతో విజయసాయిరెడ్డికి ఉన్న బలమైన సంబంధాలు అందరికీ తెలిసినవే. ఏపీలో కూటమి బలంగా ఉండటంతో నేరుగా బీజేపీలో చేరడానికి సాంకేతిక, రాజకీయ ఇబ్బందులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా ఒక వర్గం అసంతృప్తి ఓట్లు వైఎస్సార్‌సీపీకి మళ్లీ గంపగుత్తగా పడకుండా నిరోధించేందుకు ఒక ప్రత్యేక టూల్ గా ఈ కొత్త పార్టీని రంగంలోకి దించుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తటస్థంగా ఉంటూనే, తెరవెనుక ఢిల్లీ పెద్దల ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదిపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.ఇక మ□డో కోణం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మైండ్ గేమ్. వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాబల్యం పెరిగి తనను పక్కనపెట్టిన నాటి నుంచి రగిలిపోతున్న విజయసాయిరెడ్డి.. తాడేపల్లి ప్యాలెస్‌కు గట్టి చెక్ పెట్టాలని చూస్తున్నారు. వైఎస్ కుటుంబానికి చెందిన నమ్మకస్తుడైన ఆడిటర్‌గా పార్టీలోని ప్రతి నాయకుడి ఆర్థిక మ□లాలు, అంతర్గత బలహీనతలు, క్షేత్రస్థాయి నెట్‌వర్క్ ఆయనకు కొట్టినపిండి. కొత్త పార్టీ వేదిక ద్వారా వైఎస్సార్‌సీపీలోని అసంతృప్త నేతలను, ద్వితీయ శ్రేణి కేడర్‌ను తనవైపు తిప్పుకుని జగన్ ఓటు బ్యాంకును చీల్చగలనని బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ కూడా ఇందులో దాగి ఉండవచ్చని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.ఒక ప్రాంతీయ పార్టీని స్థాపించి క్షేత్రస్థాయిలో నిలబెట్టడం అనేది సాధారణ వ్యవహారం కాదు. కేవలం వి□డియా దృష్టిని ఆకర్షించడానికో లేక బేరసారాల కోసమో పెట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర ఏపీలో ఎన్నో ఉన్నాయి. విజయసాయిరెడ్డి వేస్తున్న ఈ పాచికల వెనుక ఉన్న అసలు లక్ష్యం ? కేసుల నుంచి ఆత్మరక్షణ కోసమా, బీజేపీ రాజకీయ ప్రయోగమా లేక జగన్‌పై ప్రతీకారమా అన్నది ఆయన పార్టీ అధికారిక ప్రకటన చేసి మొదటి అడుగు వేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.



# 'ఉనికి' కోసమే జగన్ ఆరాటం !

**విజయవాడ, అఖండ సూర్య**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న వరుస నియోజకవర్గాల సవి□క్షా సమావేశాల్లో కేడర్‌నుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి.గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ ఒత్తిడి వెనుక బలమైన రాజకీయ భయం దాగి ఉంది. ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి. ఎన్నికల్లో పోటీ లేకపోవడం వల్ల ప్రత్యర్థి పక్షాలకు ఏకగ్రీవాలు దక్కితే, అది పార్టీ నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందనే భయంతోనే ఓడిపోయినా పర్వాలేదు.. బరిలో నిలబడండి అనే నినాదాన్ని ఆయన ముందుకు తెస్తున్నారు.అయితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల మానసిక స్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఐదేళ్ల అధికార కాలంలో సంక్షేమ పథకాల బటన్ల పంపిణీకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీకి అండగా నిలిచిన ద్వితీయ శ్రేణి నాయకులకు, సాధారణ కార్యకర్తలకు దక్కలేదనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. పాలనా వ్యవహారాల్లో అక్రమాలు, దందాల ఆరోపణలు ఎదుర్కొన్న పెద్దలు ఇప్పుడు సురక్షితంగా ఇళ్లకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లను, కేసులను తామే భరించాల్సి వస్తోందని కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలో పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాకపోవడం, కొత్తగా సొంత జేబుల నుంచి లక్షలు ఖర్చుపెట్టి పోటీ చేసే ఆర్థిక స్తోమత లేకపోవడం కేడర్‌ను వెనుకడుగు వేసేలా చేస్తోంది.గ్రామస్థాయిలో ప్రత్యర్థులతో ఘర్షణ పడి ఆస్తులు, వ్యాపారాలను నష్టపోవడం కన్నా.. స్థానికంగా సర్దుబాటు రాజకీయాలు చేసుకోవడం లేదా మౌనంగా ఉండటమే మేలనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకత్వం నుంచి ఎలాంటి రక్షణ భరోసా లభించనప్పుడు, కేవలం పార్టీ పరువు కాపాడటం కోసం తాము బలిపశువులం కాలేమనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. కార్యకర్తల్లోని ఈ నైరాశ్యాన్ని గుర్తించినందువల్లే జగన్ వారిని ప్రత్యేకంగా పిలిపించి బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అగ్రనాయకత్వం తన ఉనికిని చాటుకోవడానికి చూస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయి



### ఏకగ్రీవం అనుకోవద్దు..

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస‌ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రంగంలోకి దిగారు. రాష్ట్రంలో అన్ని స్థానాలకు పోటీచేయాలని, ఏ ఒక్క స్థానం ఏకగ్రీవం కాకూడదని ఇప్పటికే నియోజకవర్గ ఇంచార్జులకు ఆదేశాలిచ్చిన జగన్ రెడ్డి తాజాగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్దిరోజుల్లో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో విజయం కోసం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పోలీసులను ప్రయోగిస్తారని, వారిని ఎదుర్కొని యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారుప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఆయన పార్టీ కేడర్ యుద్ధానికి సిద్దంగా ఉండాలని పిలుపునివ్వడం ద్వారా ఎన్నికల్లో రాజీ లేని పోరాటం చేస్తామని సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎన్నికల హావి□లు అమలు చేయడం లేదని, ఈ కారణంగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి ఓటేస్తారని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. "పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి" అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి, యుద్ధ ప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు.ఏడాదిలో పాదయాత్ర రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మరోసారి తన పాదయాత్రపై ప్రకటన చేశారు. ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత వైసీపీనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అయితే స్థానిక ఎన్నికల్లో అది కనిపించకుండా ఉండేందుకు పోలీసులను వాడుకుంటారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



## పిల్లలపై పర్యవేక్షణ తప్పనిసరి

- **శ్రీ గ్రీన్ వుడ్ స్కూల్ కరస్పాండెంట్ మిట్టపల్లి మహేష్ రెడ్డ**

**రాయికల్, అఖండ సూర్య :**

మండల కేంద్రంలోని శ్రీ గ్రీన్ వుడ్ ఉన్నత పాఠశాలలో నల్గొండ జిల్లాలో ప్రిన్సిపల్ రూప రెడ్డి నీ విద్యార్థులే హత్య చేయడం బాధాకరం దానికి నిరసనగా పాఠశాలలో రెండు నిమిషాలు మౌనం పాటించారు.. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రిన్సిపల్ రూపరెడ్డిని హత్య చేసింది విద్యార్థులు అని తేలడంతో సమాజం ఒక్కసారి ఉలిక్కిపడిందని, ఈ సంఘటన ప్రస్తుతం పిల్లల మానసిక ప్రవర్తన ఆందోళనలు తెలియజేస్తుందని, ఒకప్పుడు టీచర్ అంటే స్టూడెంట్ కి భయం ఉండేది ఎంత దండించిన ఎదురు తిరిగేవారు కాదు కానీ ఇప్పుడు ఒక్క మాట అన్న పడటం లేదు. పిల్లలు పెరుగుతున్న తరుణంలో తల్లి దండ్రుల పర్యవేక్షణ ఉండాలని, పిల్లల్లో ఈ ప్రవర్తనను మార్చాల్సింది పేరెంట్స్ అని దానికి పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు.

## రైతులకు తప్పిన రహదారి కష్టాలు

**బోనకల్, అఖండ సూర్య:**

మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం జంగిల్ క్లియరెన్స్(ముళ్లపొదలు, పిచ్చిచెట్ల) తొలగింపు పనులను సర్పంచ్ కాటేపల్లి అశ్విని శేఖర్, ఉప సర్పంచ్ పల్లా కొండల రావు ప్రారంభించారు. గ్రామంలోని కోతి గుడి వద్ద నుండి చెరువు కట్ట వరకు రైతులు పొలాలకు వెళ్లే ప్రధాన మార్గంలో దట్టంగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనుల్లో ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ మెంబర్లు బోయిన్పల్లి పున్నయ్య, కొండేటి అప్పారావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## జమ్మికుంటలో ఇసుక రీచ్ ను ఏర్పాటు చేయాలి

- **తహసిల్దార్‌ను కోరుతూ వినతి పత్రం అందజేత**

**అఖండ సూర్య ,జమ్మికుంట:**

జమ్మికుంట మండలంలో ఇసుక కొరత తీవ్రమవ్వడంతో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలో తక్షణమే అధికారికంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని ఈ సందర్భంగా బిజెపి నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు దొంతరవేన రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. జమ్మికుంట మండల పరిధిలో ఇసుక దొరక్కపోవడం వల్ల సామాన్య ప్రజలు గృహ నిర్మాణ పనులు చేపట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సొంత ఇళ్ల నిర్మాణాలే కాకుండా, ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులు కూడా ఇసుక కొరత కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి వెంటనే జమ్మికుంట మండలంలో ఇసుక రీచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.మండలానికి ఇసుక రీచ్‌ను మంజూరు చేసి ఏర్పాటు చేయకపోతే బిజెపి కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రజలను మమేకం చేస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని వినతిపత్రం ద్వారా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు, సర్పంచులు కేవిడే కుమార్ స్వామి, గరికడి శ్రీధర్, ముఖ్య నాయకులు పుల్లూరి ఈశ్వర్, నాగపురి విక్రమ్, కొట్టాల మల్లేష్, భీమిలి వెంకటేశ్వర్లు, శెట్టి హరీష్, కనబోయిన సమ్మయ్య, భీమిలి కిషన్ రావు, గరిగంటి శ్రీధర్, లింగమూర్తి, శ్రీనివాస్, ఆవుల తిరుపతి, అశోక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# "ప్రజా అగ్ని పత్రం" రాజకీయ స్వార్థం కాదు

- **సామాన్యుడి రక్తం తాగుతున్న పోలీస్ వ్యవస్థపై బొల్లం మల్లయ్య యాదవ్ రణభేరి**
- **హోంమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీకి ప్రజా అగ్ని పత్రం**
- **మాజీ శాసన సభ్యుడు మల్లయ్య యాదవ్ ఫైర్**

**అఖండ సూర్య కోదాడ**

కోదాడ గడ్డపై దళిత, గిరిజన, బీసీ బిడ్డలపై సాగుతున్న అక్రమ పోలీస్ దాడులకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హోంమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీల నిమ్మకు నీరెత్తిన వైఖరిని నిలదీస్తూ ఆయన 'ప్రజా అగ్ని పత్రం' పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేశారు.

డుగు బలహీన వర్గాల పక్షాన సంధిస్తున్న ఈ లేఖాస్త్రం ఏ ఒక్క రాజకీయ స్వార్థం కోసమో కాదని, చట్టం ముందు మోకాళ్లెక్కి ఏడుస్తున్న కోదాడ అణగారిన గుండెల ఆక్రందన అని ఆయన పేర్కొన్నారు.

**కాసుల వేటలో ఖాకీలు,**

**ఎమ్మెల్యే పైరవీలకే చట్టం దాసోహం**

బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగే పని లేకుండా, నేరుగా ఇంటికే వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం" అని ముఖ్యమంత్రి గొప్పలు చెప్పారని, కానీ కోదాడలో సామాన్య జనం ఫిర్యాదు ఇద్దామన్నా గంటల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కోదాడ పోలీస్ స్టేషన్లలో చట్టం మాట్లాడటం లేదు, కేవలం 'నోట్ల కట్టలు' మాత్రమే మాట్లాడుతున్నాయని, ఎవరి డబ్బు సంచి బరువుగా ఉంటే వారికే న్యాయం జరుగుతోందని విమర్శించారు.

**పశువుల కేసులో**

**18 లక్షల వసూలు - వసూల్ రాజా**

అక్రమ పశువుల రవాణా కేసులో ఖాకీల పైసల పంచాయితీ బయటపడిందని బొల్లం ఆరోపించారు. లక్ష్మీపురం కాలనీకి చెందిన అధికార పార్టీ నాయకుడు మేకపోతుల సత్యనారాయణ అనే వసూల్ రాజా, కేసు లేకుండా చేస్తానని మతాన్ అనే బాధితుడి నుండి రూ. 18 లక్షలు వసూలు చేశాడని, డబ్బులు తిరిగి అడిగితే గరిడేపల్లి, నేరేడుచర్ల స్టేషన్లలో అక్రమ కేసులు పెట్టిస్తానని బెదిరిస్తున్నాడని తెలిపారు. అందులో పోలీసులు కేవలం 5 లక్షలు మాత్రమే రికవరీ చేయగా, మిగిలిన 13 లక్షలు స్వాహా చేశాడని ఆరోపించారు. బాధితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని విలపిస్తుంటే, తల్లి ఫాతిమా మీడియా ముందు కన్నీరు పెడుతుంటే పోలీస్ వ్యవస్థ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**శిరీష హత్య, దళిత బిడ్డ రాజేష్ లాకప్ మరణం**

న్యాయం కోసం స్టేషన్ మెట్లెక్కిన శిరీషను రాత్రి పూట వెనక్కి పంపడం వల్ల ఆమె నడిరోడ్డుపై భర్త చేతిలో దారుణంగా హతమైందని, దళిత యువకుడు కర్ల రాజేష్‌ను అక్రమ కస్టడీలో ఉంచి థర్డ్ డిగ్రీతో చంపారని, దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఆయన గుర్తు చేశారు.

**నడిరోడ్డు హత్యను యాక్సిడెంట్‌గా చిత్రీకరణ**

కోదాడ నియోజకవర్గం మద్యం, గంజాయి, డ్రగ్స్, ఇసుక, మట్టి, కల్తీ నూనె, నకిలీ హైడ్రాలిక్ ఆయిల్, పీడీఎస్ బియ్యం, వడ్డీ వ్యాపారాలకు అడ్డాగా మారిందని, పోలీసులు బడా తిమింగలాలను వదిలేసి చిన్న ఉద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలపైనే కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు.



ఖమ్మం క్రాస్‌రోడ్‌లో యువకుడిని లారీ కిందకు తోసి చేసిన హత్యను పోలీసులు మొదట యాక్సిడెంట్‌గా చిత్రీకరించి లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేశారని, సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చేవరకు నిద్రపోయారని విమర్శించారు. ఒకవేళ సీసీటీవీ లేకపోతే ఆ హత్య యాక్సిడెంట్‌గానే మిగిలిపోయేదని అన్నారు.

భవానీనగర్‌లో దొంగలు ఇళ్లలో చొరబడి ఫ్రిజ్‌లోని కూల్ డ్రింకులు తాగుతూ దొంగతనాలు చేస్తున్నారంటే పెట్రోలింగ్ ఎంతగా కుప్పకూలిందో అర్థమవుతోందని, 80 లక్షల అప్పుకు 80 ఎకరాలు కాజేసిన వడ్డీ వ్యాపారులపై చర్యలు లేక బాధితులు స్టేషన్ ముందే ధర్నా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

**కోదాడ టౌన్ ఎస్ఐ పోస్ట్ ఖాళీ**

కోదాడ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ దీర్ఘకాలంగా ఖాళీగా ఉండటమే పోలీస్ శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని అన్నారు.

రాష్ట్రంలో హోంశాఖను స్వయంగా చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ తక్షణమే స్పందించి లంచాల పర్వం, పైసల పంచాయితీలపై విచారణ జరిపి కోదాడను నేర రహిత ప్రాంతంగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, తామే ఖాకీ డ్రెస్ లేని పోలీస్ అవతారం ఎత్తుతామని హెచ్చరించారు.

# సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహ

నేర నియంత్రణకు సీసీటీవీలు, సరిహద్దు నిఘా బలోపేతం

**అఖండ సూర్య కోదాడ**

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ శుక్రవారం కోదాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ నిర్వహించారు.

జిల్లాలోని సర్కిల్ కార్యాలయాల తనిఖీల్లో భాగంగా కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డితో కలిసి అయన ఈ తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి, కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ, సామర్థ్యంతో పనిచేసి బాధితులకు, పౌరులకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని కోదాడ రూరల్, అనంతగిరి, చిలుకూరు, చింతలపాలెం, మేళ్లచెరువు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు తీరును పరిశీలించారు. గ్రామాల చరిత్ర, సస్పెక్ట్ షీట్స్, రౌడీ షీట్స్ రికార్డులను తనిఖీ చేశారు.

సర్కిల్ పరిధిలోని స్టేషన్ల పనితీరు, సిబ్బంది పనితీరు బాగుందని అభినందించిన ఎస్పీ,



కేసులు, ఫిర్యాదులు పెండింగ్ ఉంచకుండా పని చేయాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి నేరాలను నివారించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ "నేరాల నిరోధానికి సర్కిల్ పరిధిలో ఎక్కువ మొత్తంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వాటిని జిల్లా కేంద్రానికి అనుసంధానం చేశాం. సర్కిల్ పరిధిలో చాలా విద్యాసంస్థలు ఉన్నందున విద్యార్థులు గొడవలు పెట్టుకోకుండా, వ్యసనాలకు లోను కాకుండా పోలీసు ప్రజా భరోసా ద్వారా అవగాహన కార్యక్రమాలు, సత్ప్రవర్తన కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. అంతర్రాష్ట్ర సరిహద్దు కలిగి ఉన్నందున నిఘా అప్రమత్తం చేసి చెక్ పోస్టుల ద్వారా, ప్రధాన మార్గాల్లో ప్రతిరోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు, అక్రమ రవాణా అరికట్టేందుకు నిఘా విభాగాన్ని, సమాచార వనరులను బలోపేతం చేశాం" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, కోదాడ సర్కిల్ ఇంచార్జి సీఐ, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, ఎస్ఐలు నవీన్ కుమార్, యాకూబ్, అంజి రెడ్డి, డీసీఆర్బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సీసీ సందీప్, టెక్నికల్ కానిస్టేబుల్ అబెద్, సిబ్బంది పాల్గొన్నారు.

# కౌంజు పిట్టల పెంపకంతో లాభసాటి ఉపాధి

**అఖండ సూర్య కోదాడ**

చిలుకూరు మండల కేంద్రానికి చెందిన బద్దం కవితారెడ్డి స్వయం ఉపాధి కోసం కోదాడహుజూర్ నగర్ రోడ్డులో నిర్వహిస్తున్న కౌంజు పిట్టల ఫారంలో రోజుకు 100 పిట్టలు చనిపోతున్నాయనే సమాచారంతో అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. పెంటయ్య, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ,డా. సిరిపురపు సురేంద్ర ఫారాన్ని సందర్శించారు. పరీక్షించగా ఎలుకల బెడదతో పిట్టలను ఒకే గదిలో ఉంచడం వల్ల స్థలం సరిపోక, ఒత్తిడి, గాలి ఆడక మరణిస్తున్నట్లు గుర్తించి వెంటనే వేరే గదుల్లోకి మార్పించి సమస్యను పరిష్కరించారు.

ఈ సందర్భంగా డా. పెంటయ్య మాట్లాడుతూ కౌంజు పెంపకం కేవలం 45 రోజుల్లో, 400 గ్రాముల దాణాతోనే కోతకు వచ్చి తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఇస్తుందని, గృహిణులు ఇంటి వద్ద చిన్న స్థలంలో పెంచి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఔషధ గుణాలున్న కౌంజు మాంసంలో అధిక ప్రొటీన్లు, జింక్, సెలీనియం, ఐరన్, బీ 12 ఉండటంతో రోగ నిరోధక శక్తి, కండరాల బలం, రక్త వృద్ధికి ఉపయోగపడుతుందని, కవితారెడ్డి పిట్టలతో పాటు మాంసం, గుడ్లు, ఫ్రైలు, కూరలు కూడా ఆర్డర్ పై వండి అమ్ముతూ ఆదర్శంగా నిలుస్తున్నారని, ఆసక్తి గలవారు వారం వారం రోజు వయసు పిట్టలను తెచ్చి 67 వారాల పెంపకం చేపడితే 45వ రోజు నుండి ప్రతిరోజూ ఆదాయం వస్తుందని సూచించారు.



# పాలిటెక్నిక్ విద్యార్థుల రహదారి బైఠాయింపు బి ఆర్ ఎస్ వి మద్దతు

**సిద్దిపేట, అఖండ సూర్య:**

పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయవద్దని డిమాండ్ చేస్తూ రాజగోపాల్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సిద్దిపేట-హన్మకొండ ప్రధాన రహదారిపై బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనకు నంగునూరు మండల టిఆర్‌ఎస్ వి విద్యార్థి విభాగం నాయకులు సంపూర్ణ సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ వి నాయకుడు తప్పెట పరశురాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పాలసీ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్, ఐటీఐ విద్యా విధానాలకు, స్కిల్ యూనివర్సిటీకి ఎలాంటి పొంతన లేదని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, పాలిటెక్నిక్ కళాశాలల విలీన




నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బి ఆర్ ఎస్ వి నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ వి నాయకులు, విద్యార్థి విభాగం కార్యకర్తలు గఫూర్, రాజు రెడ్డి, చందు గౌడ్, సోహెల్, ఇమ్రాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.




## జమ్మికుంట లో ఘనంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు

**అఖండ సూర్య, జమ్మికుంట:**

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జమ్మికుంటలో బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్పందన అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి, ఆశ్రమంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సంఘము నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం గెల్లు శ్రీనివాస్ యాదవ్ చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు.బీఆర్ఎస్వీని బలోపేతం చేయడంతో పాటు యువతను ఐక్యంగా ముందుకు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు, యువతకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్, జవ్వాజి అనిల్, నల్లగాష హరీష్ యాదవ్, నరేంగుల శివ యాదవ్, చింతల కౌశిక్‌తో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**చేర్యాల, అఖండ సూర్య :**

చేర్యాల మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, గిరిజన ప్రాంత అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం, శుక్రవారం చేర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించారు.

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తూ, నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హతలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్టేషన్ చేయించి సమర్పించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ధ్రువపత్రాలను నిశితంగా పరిశీలించి, అర్హత ప్రమాణాలకు అనుగుణంగా తదుపరి ప్రక్రియను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో సీడీపీఓ రమాదేవి, కార్యాలయ సిబ్బంది కృష్ణ, రాకేష్, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు సుస్మిత, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టైగర్ ఆలే నరేంద్ర 80 వ జయంతి వేడుకలు

**అఖండ సూర్య, హుజురాబాద్:**

హుజురాబాద్ పట్టణంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో హుజురాబాద్ పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఘనంగా టైగర్ ఆలయ నరేంద్ర 80 వ జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఎలిగేటి ఉపేందర్, రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, రాష్ట్ర పద్మ శాలి సంఘం కార్యదర్శి చిలుక మారి శ్రీనివాస్,వేముల యాదగిరి, సబ్బని రాజేందర్ ,మంచి కట్ల కమలాకర్, చేనేత జిల్లా సెల్ అధ్యక్షులు బండారి సదానందం , చేనేత సెల్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రామచంద్రము,మంద బిక్షపతి, ముషం వెంకటేశ్వర్లు, పాత్రికేయులు తాటిపాముల దేవేందర్, పాత్రికేయులు పోతరాజు సంపత్, సంగెం శ్రీనివాస్ (చిక్స్) సంగెం శ్రీనివాస్ (మెడికల్), కుడికాల ప్రభాకర్, మరియు అధిక సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు, నేత కార్మికులు మహిళా కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి వర్యులు శ్రీ టైగర్ ఆలే నరేంద్ర గారు తన జీవితమంతా పేద ప్రజలకు అండగా నిలబడి బడుగు బలహీన వర్గాల పక్షాన పని చేశారని తెలంగాణ సాధన సమితి నెలకొల్పి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో కీలక పాత్ర పోషించారాని కొనియాడారు.





## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం సర్పంచ్ నరేష్‌రెడ్డి

**నంగునూరు, అఖండ సూర్య:**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నంగునూరు సర్పంచ్ నరేష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో చెట్లు, అడవులను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ఫలితంగా వాతావరణంలో అనేక ప్రతికూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి పౌరుడు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. గ్రామాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉపసర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సొమ్ము కేంద్రానిది సోకు రాష్ట్రానిది

- **లద్నూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎబివిపి నాయకుల నిరసన**
- **రేషన్ కార్డులపై ప్రధాని మోడీ బొమ్మ ఏది**
- **బి జె వై ఎం నాయకులు మనోజ్ కుమార్**

**మద్దూరు, అఖండ సూర్య**

కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ కార్డులపై ప్రదాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టకపోవడాన్ని నిరసిస్తూ లద్నూరు గ్రామంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బీజేవైఎం నాయకులు మనోజ్ కుమార్ బహిష్కరించారు.ఈసందర్భంగా బి జె వై ఎం నాయకులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ, పేదలకు ఇస్తున్న 6 కిలోల బియ్యంలో 5 కిలోలు కేంద్ర ప్రభుత్వానిది అని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 1 కిలో అందిస్తున్నప్పుడు,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఫోటో పెట్టుకుంటే,5 కిలోల బియ్యం అందిస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ఎందుకు పెట్టకూడాదో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సొంతంగా అమలు చేయలేదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలకు తెలంగాణ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఉద్దేశంతో నరేంద్ర మోడీ ఎదుగుదలను ఓర్వలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడం చేతకాక నరేంద్ర మోడీ ప్రభుత్వం పైన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక విమర్శలు చేస్తుంది అని, ఎన్ని విమర్శలు చేసిన తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాష్ట్రంలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి వార్డు సభ్యులు అన్నోజు మంజుల, గోవిందచారి,కాసర్ల కనక లక్ష్మి శ్రీనివాస్,వజ్జల భీష్మ చారి,యాదగిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట, అఖండ సూర్య :**

సిద్దిపేట పట్టణంలోని సంతోషిమాత ఆలయాన్ని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత అమ్మవారి ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆయన ప్రార్థించారు.

అనంతరం ఆలయ పూజారులు, సంతోషిమాత ఆలయ కమిటీ సభ్యులు పూజల హరికృష్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, భక్తులకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంప చంద్ర్, చొప్పదండి రాము, చింత సంతోష్, కె. బ్రహ్మం, జిల్లా రజిత, రవికంటి జయప్రద, బండి మమత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, దేశెట్టి నరేష్, పవన్, నాగరాజు, వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఉప్పెరెట్ల సంతోష్, అరవింద్, సుధీర్, లహరి, రజని, సన, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారుల సందడిలో వీరన్నపేట అంగన్వాడీలో వరలక్ష్మీ వ్రత వేడుకలు

**చేర్యాల , అఖండ సూర్య :**

వీరన్నపేట అంగన్వాడీ కేంద్రంలో వరలక్ష్మీ వ్రత వేడుకలను తల్లిదండ్రులు, చిన్నారుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.

ఈ సందర్భంగా చిన్నారులకు వరలక్ష్మీ వ్రతం విశిష్టతను వివరించడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆనందం, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అంగన్వాడీ కేంద్రం సందడిగా మారింది.

కార్యక్రమంలో సర్పంచ్ శైలజ శివశంకర్, ఉప సర్పంచ్ కిరణ్ కుమార్, వార్డు సభ్యులు, పద్మ, తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు.



# సర్ లో ఈ నాలుగైదు రోజులే కీలకం

- ఓటర్ల జాబితా సవరణలపై అప్రమత్తంగా ఉండాలి
- అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చూసుకోవాలి
- అభ్యంతరాలకు రసీదులు తీసుకుని రికార్డుగా భద్రపరచాలి
- శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి దిశా నిర్దేశం

**అఖండసూర్య, విజయవాడ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. ముందుగా ఎమ్మెల్సీ శ్రీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడగా, అనంతరం శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సర్‌లో రెండో విడత కార్యక్రమం దాదాపు పూర్తవుతున్నందున మ్యాపింగ్, నాన్‌మ్యాపింగ్, గైర్హాజరు, చిరునామా మార్పులు, డూప్లికేట్, మరణించిన ఓటర్లకు సంబంధించిన సమాచారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంట్ సమన్వయకర్తలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంట్ పరిశీలకులు, రాష్ట్ర స్థాయి సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న నేతలు, అసెంబ్లీ పరిశీలకులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యంతరాలు, క్లెయిమ్స్ దాఖలు చేసేందుకు నెలాఖరు వరకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉన్నందున పార్టీ యంత్రాంగం వేగంగా పనిచేయాలని స్పష్టం చేశారు. గత నాలుగైదు నెలలుగా బూత్ స్థాయిలో బీఎల్ఏలు చురుకుగా పనిచేయడం వల్ల అర్హులైన ఓట్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవడంలో మంచి పురోగతి సాధించామని చెప్పారు. ఓటర్ల సంఖ్య 4.16 కోట్ల నుంచి 3.71 కోట్లకు తగ్గిన నేపథ్యంలో తొలగింపులకు సంబంధించిన వివరాలను పార్టీ శ్రేణులు నిశితంగా పరిశీలించాలని సూచించారు.




**17.29 లక్షల అనుమానాస్పద ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి**

ఇప్పటికే వచ్చిన 44 లక్షల నోటీసుల్లో అనుమానాస్పద అంశాలను గుర్తించి, ప్రతి ఓటు స్థాయిలో పరిశీలన జరపడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ఓట్లు తొలగించే పరిస్థితిలో ఉంటే సంబంధిత ఫారాలను సమర్పించి వాటిని తిరిగి జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డూప్లికేట్ లేదా బోగస్ ఓట్లుగా భావించిన వాటిపై అవసరమైన అభ్యంతరాలను సమర్పించాలని చెప్పారు. ఇదే సమయంలో చిరునామా మార్పులు, ఇతర సవరణలకు సంబంధించిన దరఖాస్తులను కూడా అవసరాన్ని బట్టి సమర్పించాలని సూచించారు. పార్టీ స్థాయిలో ప్రత్యేకంగా గుర్తించిన సుమారు 17.29 లక్షల అనుమానాస్పద డూప్లికేట్ ఓట్లను బూత్ స్థాయిలో పరిశీలించాలని సజ్జల తెలిపారు.

**డూప్లికేట్ ఓట్లపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**

ఒకే పేరుకు లేదా ఇతర వివరాలకు దగ్గరగా ఉన్న ఓటర్లు వాస్తవంగా ఒకరేనా, వేర్వేరు వ్యక్తులా అనే అంశాన్ని బీఎల్ఏలు స్థానికంగా నిర్ధారించాలని సూచించారు. తమకు చెందిన ఓటు అయితే దాన్ని కొనసాగించేలా, తమకు సంబంధం లేని లేదా డూప్లికేట్‌గా గుర్తించిన ఓటుపై అవసరమైన అభ్యంతరం దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బీఎల్ఏల ద్వారా వచ్చిన సమాచారాన్ని నియోజకవర్గ కోఆర్డినేటర్లు సమీకరించి సంబంధిత ఈఆర్ఓలకు సమర్పించాలని, సమర్పించిన ప్రతిసారీ రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో అభ్యంతరాలపై చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ లేదా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ రసీదులు, ఇతర పత్రాలు ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను నాలుగైదు రోజుల్లో పూర్తి చేసేలా బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**బయట ఉన్న ఓటర్లతో సమన్వయం అవసరం**

క్లస్టర్ ఇన్‌చార్జీలు, కంట్రోల్ రూమ్‌లు, టాస్క్‌ఫోర్స్, పార్లమెంట్ మరియు అసెంబ్లీ పరిశీలకుల సహకారంతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌కు సంబంధించిన అనుమానాస్పద డూప్లికేట్ ఓట్లపైనా వచ్చిన జాబితాలను పరిశీలించి, అవసరమైన అభ్యంతరాలను సమిష్టిగా సమర్పించాలని చెప్పారు. ఆగస్టు 27, 28 తేదీల నాటికి ప్రధాన ప్రక్రియను పూర్తి చేసి, నెలాఖరు చివరి రెండు రోజుల్లో తుది పరిశీలనకు అవకాశం ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఆగస్టు 30 తర్వాత అవకాశాలు పరిమితమవుతాయని, అందువల్ల ప్రస్తుతం ఉన్న సమయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక క్యాంపెయిన్ రోజుల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, ఆ అవకాశాన్ని బీఎల్ఏలు వినియోగించుకుని ఓటర్ల జాబితా, దరఖాస్తులు, నోటీసులు, సవరణల వివరాలను పరిశీలించాలని సూచించారు. బయట ఉన్న ఓటర్లకు సంబంధించిన అంశాల్లో వారికి అందుబాటులో ఉన్న విధానాలపై అధికారులతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైన సమాచారాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. సర్ ప్రక్రియను క్రమబద్ధంగా పూర్తి చేయడం ద్వారా అర్హులైన ఓటర్ల ప్రయోజనాలను కాపాడటంతో పాటు భవిష్యత్ ఓటర్ల జాబితా సవరణల్లో కూడా ఇబ్బందులు తగ్గుతాయని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

**ఎన్నికల సన్నద్ధతపై 25 న వైఎస్ జగన్ దిశానిర్దేశం**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై పార్టీ న్యాయపరమైన చర్యలు తీసుకుంటోందని, పార్టీ ఎన్నికలకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండేలా శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని సజ్జల తెలిపారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ గారు ఆగస్టు 25న కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. రాబోయే కొద్దిరోజులు పార్టీకి చెందిన సిబ్బంది, సహాయకులు, నియోజకవర్గ స్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నవారికి స్పష్టమైన టార్గెట్లు కేటాయించి పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమంపై దృష్టి పెట్టాలని సూచించారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ!

- ఏళ్ల నిరీక్షణకు తెర.. కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం
- క్రమబద్ధీకరణకు విశేష కృషి చేసిన NGO రాష్ట్ర నాయకత్వానికి సన్మానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల హృదయపూర్వక కృతజ్ఞతలు
- ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

**అఖండసూర్య, విజయవాడ**

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రక్రియ విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు అలుపెరగని కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ A. విద్యాసాగర్ గారిని, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు.

**కీలక పాత్ర పోషించిన 'సాగర్-రమణ' నాయకత్వం:**

ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని కొనియాడారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధ్యక్షుడు విద్యాసాగర్ గారు నిరంతరం శ్రమించారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే ముఖ్యమంత్రి ఆమోదం, క్యాబినెట్ ఆమోదం లభించడమే కాకుండా, అసెంబ్లీలో బిల్లు పాస్ అయిందని గుర్తుచేశారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ప్రాసెస్ చట్ట సవరణ (అమెండ్మెంట్) ద్వారా సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమమైందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం చొరవతో 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కి మార్గం ముఖ్యమంత్రి ఆమోదంతో సగం అయిందని, ఇప్పుడు యాక్ట్ 30 సవరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు కూడా మార్గం సుగమం అయిందని తెలిపారు.

**ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు:**

ఏళ్ల తరబడి వేచి చూస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కుటుంబాలకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఆర్థిక శాఖమాత్యులు పయ్యావుల కేశవ్ గారికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శాఖాధికారులకు మరియు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు సమర్పించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో విచ్చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులకు రూ.221.67 కోట్లు

మొదటిపేజీ తరువాయి

ఆసుపత్రులను నిర్మించనున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో రూ.9.98 కోట్లు, పోలవరం జిల్లా రంపచోడవరంలో రూ.10.57 కోట్లు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రూ.10.52 కోట్లు, గుంటూరు జిల్లా తెనాలిలో రూ.10.50 కోట్లు, మార్కాపురం జిల్లా గిద్దలూరులో రూ.10.58 కోట్లు, తిరుపతి జిల్లాలో రూ.9.99 కోట్ల అంచనా వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

**ప్రొద్దుటూరులో యునాని.. ధర్మవరంలో ఆయుర్వేద కళాశాలలు**

కడప జిల్లా ప్రొద్దుటూరులో ప్రభుత్వ యునాని వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.49 కోట్ల అంచనా వ్యయంతో, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.49 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

**VIMSలో నేచురోపతి–యోగ కళాశాల.. ఆయుష్ ఆసుపత్రికి అదనపు వసతులు**

విశాఖపట్నంలోని VIMS ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ నేచురోపతి, యోగ కళాశాలకు ప్రస్తుతం ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌పై మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.9.37 కోట్లు అంచనా వేశారు. అదే ప్రాంగణంలోని 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రిలో ప్రస్తుత రెండో అంతస్తుపై అదనపు నిర్మాణంతో పాటు కళాశాల క్లినికల్ విభాగానికి అవసరమైన సౌకర్యాల కోసం మూడో అంతస్తు నిర్మాణానికి రూ.3.04 కోట్లు కేటాయించారు.



**చింతూరు ఏరియా ఆసుపత్రి.. కాకినాడ జీజీహెచ్‌లో కొత్త ఓపీడీ బ్లాక్ నిర్మాణాలు**

చింతూరులోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిగా ఉన్నతీకరించేందుకు రూ.21.99 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో కొత్త రోగుల ఓపీడీ భవనం నిర్మాణానికి రూ.27.13 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (APMSIDC) ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల ప్రక్రియ చేపట్టింది.



# వివేకా హత్య కేసులో ఈడీ సోదాలు

మొదటిపేజీ తరువాయి

నగదు లావాదేవీలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**రూ.4 కోట్ల నగదు ఎక్కడి నుంచి?**

వివేకా హత్య కేసులో నిందితులకు అందినట్లు దర్యాప్తులో వెల్లడైన *రూ.4 కోట్ల నగదు*పై ఈడీ ప్రధానంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సమకూర్చారు? ఎవరికి, ఎలా చేరింది? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. హత్య కేసులో రాజకీయ నేతల ప్రమేయం, నగదు లావాదేవీలు, మనీలాండరింగ్ కోణాలను ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. సీబీఐ దర్యాప్తు సందర్భంగా వెలుగులోకి వచ్చిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను మరింత లోతుగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# జ్యుడీషియల్ సర్వీసుకు ప్రాక్టీస్ ఏడాదే

మొదటిపేజీ తరువాయి

అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఒక సంవత్సరానికి తగ్గించింది. మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనను పూర్తిగా తొలగించాలన్న అభ్యర్థనను అంగీకరించకపోయినా.. యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మధ్యే మార్గాన్ని ఎంచుకుంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై జస్టిస్ కె. వినోద్ చంద్రన్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు.

**2027 ఏప్రిల్ నుంచి ఏడాది ప్రాక్టీస్**

2027 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత వెలువడే సివిల్ జడ్జి నియామక పరీక్షల నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం ఒక సంవత్సరం యాక్టివ్ న్యాయవాద వృత్తి అనుభవం కలిగి ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ అనుభవాన్ని సంబంధిత ధ్రువీకరణ పత్రాల ద్వారా పరిశీలిస్తారు.

**ఫ్రెషర్లకు ప్రత్యేక మినహాయింపు**

అయితే 2025 మే 20 నుంచి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు ఈ ప్రాక్టీస్ నిబంధన వర్తించదు. అంటే ఈ కాలంలో నోటిఫికేషన్ వెలువడే పరీక్షలకు ప్రాక్టీస్ అనుభవం లేకున్నా లా గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారు నేరుగా ట్రెయినీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులవుతారు.



**రెండేళ్ల శిక్షణ**

ఎంపికైన అభ్యర్థులు ముందుగా ఒక సంవత్సరం స్టేట్ జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందాలి. అనంతరం మరో ఏడాది స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ పూర్తి చేయాలి. ఈ క్లర్క్‌షిప్‌లో మొదటి ఆరు నెలలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా హయ్యర్ జ్యుడీషియల్ సర్వీస్ సభ్యుల పర్యవేక్షణలో పనిచేయాలి. తర్వాతి ఆరు నెలలు హైకోర్టు సిట్టింగ్ జడ్జిల పర్యవేక్షణలో క్లర్క్‌షిప్ చేయాలి. శిక్షణ కాలంలో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ స్థూల వేతనంలో సగానికి సమానమైన గౌరవ వేతనం అందిస్తారు. శిక్షణ, క్లర్క్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాతే రెగ్యులర్ పోస్టులో నియమించి పూర్తి స్థాయి వేతనం చెల్లిస్తారు.

**కఠిన నిబంధనలతో యువతకు నష్టం వద్దు**

న్యాయవ్యవస్థలోకి వచ్చే ముందు అభ్యర్థులకు కొంత వృత్తిపరమైన అనుభవం ఉండాలన్న ఉద్దేశాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. అదే సమయంలో కఠినమైన నిబంధనల వల్ల యువ లా గ్రాడ్యుయేట్లు, మహిళలు, దివ్యాంగులు నష్టపోకుండా మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో నేరుగా జ్యుడీషియల్ సర్వీసుల్లోకి రావాలనుకునే న్యాయ విద్యార్థులకు ప్రస్తుతం ప్రత్యేక అవకాశం లభించినట్టయింది.



# షావుకారు జానకి కన్నుమూత

మొదటిపేజీ తరువాయి

చేశారు. తొలి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. అప్పటి నుంచి ఆమె షావుకారు జానకిగా ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు.

**ఐదు భాషల్లో నటన**

దాదాపు 70 ఏళ్లకుపైగా సాగిన సినీ ప్రస్థానంలో షావుకారు జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నటించారు. సుమారు 380 చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించారు. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, తల్లి, అత్త, బామ్మ వంటి పాత్రల్లోనూ తనదైన ముద్ర వేశారు.

**చివరి సినిమా 'అన్నీ మంచి శకునములే'**

వయసు పెరిగినా నటనకు దూరం కాలేదు. 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో చివరిసారిగా కనిపించారు. దాదాపు ఏడు దశాబ్దాల పాటు సినీ పరిశ్రమలో కొనసాగిన ఆమె.. పలు తరాల ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. షావుకారు జానకి మృతితో తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.



# సీజేపీ బృందంపై దాడి

మొదటిపేజీ తరువాయి

తెలిపాయి. రాళ్లు విసరడంతో పలువురు గాయపడ్డారు. కార్యకర్తల కార్లు, ఫోన్లను కూడా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

**'నా చొక్కా చింపేశారు'**

దాడిపై ఆశుతోశ్ రాంకా స్పందించారు. ఈ ఘటనకు బీజేపీయే కారణమని ఆయన ఆరోపించారు. గోశాలలో పాఠశాల నిర్వహిస్తున్నారని, దానిని పరిశీలించాలంటూ గ్రామస్థులు కోరడంతోనే తాము అక్కడికి వెళ్లామని తెలిపారు. చాలా సంవత్సరాలుగా పాఠశాల గోశాలలోనే కొనసాగుతోందని, గత ఏడాది కూడా తాము ఆ పాఠశాలను సందర్శించామని రాంకా పేర్కొన్నారు. తమ పర్యటన గురించి ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. అయితే అక్కడికి బీజేపీకి చెందిన వ్యక్తులు వచ్చి తమ వాలంటీర్లపై దాడి చేశారని ఆరోపించారు. కార్లు, ఫోన్లను ధ్వంసం చేశారని, ఓ మహిళపై కూడా దాడి చేశారని పేర్కొన్నారు. తన చొక్కాను చింపేశారని, తమ బృందంలోని ఒకరి చేయి విరిగిందని రాంకా తెలిపారు.

**బీజేపీ నేతలపై రాంకా ఆరోపణలు**

తమపై దాడి చేసేందుకు ఓ స్థానిక బీజేపీ నేత బయట నుంచి కొంతమంది వ్యక్తులను తీసుకొచ్చారని రాంకా ఆరోపించారు. ఈ ఘటనకు గ్రామస్థులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. హింసను ప్రేరేపించేందుకు బయటి వ్యక్తులను పంపించారని, స్థానిక బీజేపీ కౌన్సిలర్ కొంతమంది వ్యక్తులకు డబ్బులు పంచుతూ కనిపించారని పలువురు తనకు చెప్పినట్లు రాంకా పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై స్వతంత్ర నిర్ధారణ జరగాల్సి ఉంది.

**అసెంబ్లీలోనూ దుమారం**

సీజేపీ బృందంపై జరిగిన దాడి రాజస్థాన్ అసెంబ్లీలోనూ చర్చకు దారితీసింది. ఈ ఘటనపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ డోటసారా దాడికి బీజేపీయే కారణమని ఆరోపించారు. దీనిపై రాజస్థాన్ హోంమంత్రి జవహర్ సింగ్ బేదం స్పందిస్తూ.. సీజేపీ ముసుగులో కాంగ్రెస్ పార్టీనే గొడవ సృష్టిస్తోందని ఆరోపించారు. దాడి ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఈ వ్యవహారం రాజకీయంగానూ తీవ్ర చర్చకు దారితీసింది.



# శ్రావణ శోభ

మొదటిపేజీ తరువాయి

ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పలు ఆలయాల్లో రద్దీ నెలకొంది. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరోవైపు మహిళలు పెద్ద సంఖ్యలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం అమ్మవారికి పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భక్తి వాతావరణం నెలకొంది.



# మడిపల్లి హత్య కేసులో 15 మంది నిందితుల అరెస్ట్

**తొర్రూర్ అఖండ సూర్య**

ఇటీవల తొర్రూరు మండలంలోని మడిపల్లి గ్రామంలో హత్యకు గురైన గుంటుక రమేష్ హత్య కేసులో 15 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ కృష్ణ కిషోర్ తెలిపారు. కుల పెద్దలను దూషిస్తున్నాడనే కారణంతో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసును తొర్రూరు పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి 15 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ గణేష్‌తో కలిసి డీఎస్పీ వివరాలు వెల్లడించారు.

మడిపల్లి గ్రామానికి చెందిన గుంటుక రమేష్ (43) ఈ నెల 19న జరిగిన ఓ కార్యక్రమం సందర్భంగా కొందరితో గొడవ పడ్డాడు. అనంతరం కాగితపు యాకయ్య, వెంకన్న, జంపయ్య, మహేష్ తదితరులు రమేష్‌పై కర్రలు, బండరాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని చెరువు సమీపంలో పడవేసి నిందితులు వెళ్లిపోయారు.



మృతుడి భార్య రజిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ప్రధాన నిందితుడి ఇంటి వద్ద మిగతా నిందితులు సమావేశమై పరారయ్యేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సైలను అభినందించి రివార్డు కోసం ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. సమావేశంలో ఎస్సైలు మహేందర్‌రెడ్డి, ఖాదర్‌పాషా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి

**మద్దూరు,అఖండ సూర్య**

మండలంలోని ధర్మారం, లద్నూరు, గాగిల్లాపూర్, గ్రామంలలో గ్రామ సర్పంచులు , జక్కుల కనుకమ్మ లింగయ్య,కాసార్ల రేణుక కనుకరాజు, ఇట్టబోయిన కనక చంద్రం ల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డ్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు సివిల్ సప్లై మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఫోటోతో ముద్రించిన కార్డులో కుటుంబ యజమానిగా మహిళ పేరుతో కూడిన కార్డు ముద్రించడం జరిగిందని , QRకోడ్ స్కాన్ చేయడంతో కుటుంబ సభ్యుల పేర్లు, నెలవారి తీసుకున్న సరుకుల వివరాలు తెలపడం ఈ కార్డు ప్రత్యేకత అని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్షులు , ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, జీ పీ ఓ లు, కారోబార్ లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బీడీ కార్మికులకు జీవన భృతి అమలు చేయాలి:వళబోజు నర్సింహాచారి

**దూల్మిట్ట ,అఖండ సూర్య**

బీడీ కార్మికులకు జీవన భృతి అమలు చేసి బీడీ కార్మికులను ఆదుకోవాలని దూల్మిట్ట మండల కార్యదర్శి వలబోజు నర్సింహాచారి అన్నారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలలో బీడీకార్మికులకు జీవన భృతి 2016 నుండి 4000 రూపాయలు పెంచుతామన్నా హామీలను అమలు చేయాలనీ డిమాండ్ చేసారు.బీడీ పరిశ్రమలో పని చేస్తు ప్రావీడెంట్ ఫండ్ పీఎఫ్ నెంబర్ కార్మికులం దరికి జీవన భృతి ఆసరా పెన్షన్ 4000 రూపాయలు అందించాలని అన్నారు.



## మల్లాపూర్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రత వేడుకలు

**అఖండ సూర్య – మల్లాపూర్:**

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ కనకదుర్గా భవాని దేవాలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు, కుంకుమార్చనలు నిర్వహించగా మల్లాపూర్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వ్రతాలు ఆచరించారు. మహిళలు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం సువాసినులకు పసుపు, కుంకుమ, వాయనం అందజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవాలయ కమిటీ చైర్మన్ యాతం సురేష్ రెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, వైస్ చైర్మన్ గంగాధర్, ఉప సర్పంచ్ గడ్డం సోమారెడ్డి, దుర్గసేవా సమితి ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## లకుడారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**కుక్కునూరు పల్లి, అఖండ సూర్య :**

లకుడారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ శిల్ప నర్సింలు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా గ్రామస్థాయిలో నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ శిల్ప నర్సింలు తెలిపారు.ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.



## ఓబులాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**అఖండ సూర్య – మల్లాపూర్:**

మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణంలో సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఖానాపూర్‌లోని సింధూ శ్రీ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో ఓబులాపూర్‌తో పాటు పరిసర తండాల ప్రజలకు వైద్య సేవలు అందించారు. సింధూ శ్రీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ పాషా ఆధ్వర్యంలో ఈసీజీ, ద్విమితీయ ఎకో, రక్తంలో చక్కెర, థైరాయిడ్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు మందులు కూడా ఉచితంగా అందజేశారు. గ్రామంలోనే వైద్య పరీక్షలు నిర్వహించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సర్పంచ్ తోట మాధురి రాజారెడ్డి, ఉప సర్పంచ్ పొన్నం విజయ్ ప్రవళిక మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది



## 34 ఏళ్లుగా భక్తుల కొంగుబంగారంగా సంతోషిమాత ఆలయం

- వరలక్ష్మీ వ్రతానికి పోటెత్తిన మహిళా భక్తులు

**సిద్దిపేట, అఖండ సూర్య :**



సిద్దిపేట పట్టణంలోని పటేల్‌పురలో కొలువు దీరిన శ్రీ సంతోషిమాత ఆలయం 34 ఏళ్లుగా భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో నిర్వహించే ప్రత్యేక పూజలు, వార్షికోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

శ్రావణమాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల నుంచే మహిళా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఉపవాస దీక్షలు చేపట్టిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలకు సుఖశాంతులు, ఐశ్వర్యం కలగాలని, కోరిన కోరికలు నెరవేరాలని సంతోషిమాతను భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారి దర్శనం కోసం మహిళా భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అర్చకులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పూజా కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు.

**ఆధ్యాత్మిక కేంద్రంగా ఆలయం**

34 సంవత్సరాలుగా సంతోషిమాతను కొలుస్తున్న భక్తులకు ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో అమ్మవారి ప్రత్యేక పూజలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.



## చిట్టాపూర్, గుండంపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అఖండ సూర్య – మల్లాపూర్:**

మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్, గుండంపల్లి గ్రామాల్లో అర్హులైన రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచులు సంపతి శంకరమ్మ, ఆశాలు దప్పుల పద్మ నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్యల చేతుల మీదుగా లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో జీపీఓలు రాజేష్, ప్రసాద్, రేషన్ డీలర్ గమిని గంగాధర్, గ్రామస్థులు కాగు మల్లయ్య, మిద్దె అంజయ్య, అంతడుపుల గంగాధర్, నాసం తిరుపతి, కిరణ్, విజయ్, రాములు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జీవో 97 రద్దు చేయాలి.. లేదంటే ఉద్యమం ఉద్ధృతం చేస్తాం

**చేర్యాల, అఖండ సూర్య :**

చేర్యాల పట్టణ బి ఆర్ ఎస్ వి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో పెద్ద ఎత్తున ,ర్యాలీగా వెళ్లి ఎంపీడీఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అంతకుముందు హైవే రోడ్డుపై ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి చేర్యాల బి ఆర్ ఎస్ వి పట్టణ అధ్యక్షుడు ఒగ్గు శ్రీశైలం గారు మాట్లాడుతూ, ఈ విలీనం వల్ల సర్టిఫికెట్ల విలువ, ఉన్నంత విద్య మరియు ఉద్యోగ అవకాశాలు మరుగునపడతాయని విద్యార్థుల భవిష్యత్ ఆగమవుతుందని, ఆందోళన వ్యక్తం చేసారు. ప్రభుత్వం తెచ్చిన జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలను 'శక్తి' స్కీమ్ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎస్బీటీఈటీ ఎస్బిటిఎఫ్ ప్రభావం, ప్రస్తుతమున్న పాలిటెక్నిక్ బోర్డు గుర్తింపు మరియు విద్య విధానాలు మారుతాయని, విద్యార్థులు భయపడుతున్నారు. భవిష్యత్తుపై త్రివమైన ప్రభావం పడుతుందని బీటెక్ మరియు ఇతర ఉన్నంత విద్య, ఉద్యోగం ఆపర్చునిటీస్ కోల్పోతారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పాలిటెక్నిక్ వ్యవస్థను స్వతంత్రంగా ఉంచాలని కోరారు. 97ను రద్దు చేయకుంటే బి ఆర్ ఎస్ వి ఆధ్వర్యంలో ఇంకా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వంను హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోదాసు రుద్ర, సాక్షిత్, అనిల్, చెందు, రాజు, వినయ్, మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.





## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై మంత్రి పొంగులేటికి వినతి

**జగిత్యాల అర్బన్:అఖండ సూర్య**

జగిత్యాల పట్టణంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరచేయాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయు) జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం జగిత్యాలకు వచ్చిన మంత్రిని జర్నలిస్టు సంఘం నాయకులు కలిసి సమస్యను వివరించారు.వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై సమగ్ర నివేదిక తయారు చేసి వెంటనే తనకు పంపాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఆదేశించారు. గతంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కూడా జర్నలిస్టులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. శాసనమండలి సభ్యుడు ఎల్. రమణ కూడా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీటీ శ్రీనివాస రావు, బెజ్జంకి సంపూర్ణచారి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా జగిత్యాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా ఇళ్ల స్థలాలు మంజూరు కాలేదన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాలచారి, యూనియన్ నాయకులు గడ్డల హరికృష్ణ, చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్టులు అలిశెట్టి మదన్ మోహన్, అంజయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




## మళ్లీ కరెంటు వైర్లు చోరీ కలకలం

**అఖండ సూర్య కోదాడ/అనంతగిరి**

అనంతగిరి మండల పరిధిలోని గోండ్రియాల గ్రామంలో మరోసారి కరెంటు వైర్ దొంగతనం ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామ శివారులోని విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లను గుర్తు తెలియని దుండగులు తెంచి ఎత్తుకెళ్లారు. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ వైర్లను కాపాడుకునే పని రైతులు సన్నద్ధం అయ్యారు.

గత కొద్ది రోజుల క్రితం జరిగిన ఈ చోరీ ఘటనపై బాధిత రైతులు, స్థానికులు అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, గోండ్రియాల గ్రామంలో ఇది కొత్తేం కాదు. గతంలో కూడా ఇదే తరహాలో పలు మార్లు కరెంటు వైర్ల చోరీలు జరిగాయి.వారిపై అదే స్టేషన్లో పిర్యాదు చేశారు నేరస్తులపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయినట్లు సమాచారం. ఈ క్రమంలో మళ్లీ ఉదంతం బయటకు రావడంతో దీంతో ఇది పాత నేరస్తుడి పనే అయి ఉంటుందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. గ్రామంలో తరచూ జరుగుతున్న వైర్ చోరీలతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిందితులను త్వరగా పట్టుకొని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**దర్యాప్తు చేస్తున్నాం: ఎస్సై**

గోండ్రియాల గ్రామంలో జరిగిన విద్యుత్ వైర్ల చోరీకి సంబంధించి స్థానిక ఎస్సై ఏడుకొండలు దర్యాప్తు చేస్తున్నారు పాత నేరస్తుల పనేనా లేక కొత్త వారా అనే కోణం చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## వెల్కటూర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలు ఏర్పాటు

**సిద్దిపేట, అఖండ సూర్య :**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వెల్కటూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా మాజీ అధికార ప్రతినిధి, సిద్దిపేట అర్బన్ ఇన్‌చార్జి చుంచు రమేష్ మాదిగ ఆధ్వర్యం వహించారు.

**ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ**

అధ్యక్షులుగా మల్లమరి మహేందర్ మాదిగ, అధికార ప్రతినిధిగా బరిగల నరేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా సిద్దంకి సతీష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా మల్లమరి బాబు, ప్రచార కార్యదర్శిగా ఐరన్ శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా మల్లమరి కనకరాజు, కార్యదర్శిగా మల్లమరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా సురేందర్, సుధాకర్, మల్లమరి రాజులను నియమించారు.

**ఎంఎస్పీ గ్రామ కమిటీ**

అధ్యక్షులుగా మల్లమరి రాజశేఖర్, అధికార ప్రతినిధిగా మల్లమరి సురేష్, ప్రధాన కార్యదర్శిగా బరిగల సాయి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా సిద్దంకి రాజు, కార్యదర్శిగా మల్లమరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా మల్లమరి శ్రీనివాస్, కార్యదర్శిగా మల్లమరి మహిపాల్‌ను నియమించారు. గౌరవ సలహాదారులుగా మల్లమరి బాల్ నర్స్ మాదిగ, మల్లమరి కుమార్, సిద్దంకి కనకయ్య, ఐరన్ కిష్టయ్యలను నియమించారు.

నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు. గ్రామస్థాయిలో సంఘం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.





## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రత లు

**నంగునూరు, అఖండ సూర్య :**

పాలమాకుల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రావణ మాస వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని శ్రీ గీతా మందిర దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు.

గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని వరలక్ష్మి దేవికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ జరిగిన పూజల్లో కుటుంబ సౌభాగ్యం, సుఖశాంతులు, సకల ఐశ్వర్యాలు కలగాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. మహిళల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు అందరినీ దైవచింతన వైపు నడిపించడమే కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## నల్గొండ ఘటనకు నిరసనగా మేడ్చల్ లో శాంతి ర్యాలీ

- **మేడ్చల్‌లో ప్రైవేట్ పాఠశాలల బంద్**

**(అఖండ సూర్య) మేడ్చల్:**

నల్గొండలోని నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రూపా రెడ్డి దారుణ హత్యను తీవ్రంగా నిరసిస్తూ మేడ్చల్‌లో గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో పాఠశాలల బంద్, భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

మేడ్చల్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలను మూసివేసి కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, యాజమాన్యాలు నల్ల బ్యాడ్జీలు, నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. లైబ్రరీ నుంచి ప్రధాన వీధుల మీదుగా వివేకానంద విగ్రహం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి రూపా రెడ్డికి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూపా రెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల నిర్వాహకులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం తక్షణమే చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు.TRSMA మేడ్చల్ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ట్రెజరర్ గిరిబాబు,మేడ్చల్ మండల కార్యదర్శి రాధాకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ లవకుమార్,ట్రెజరర్ జి ఎల్ వి మూర్తి,జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ,కో ఆప్షన్ మెంబర్స్ మాత్యు జోసెప్ ,శ్రీనివాస్ రెడ్డి,పాటు మేడ్చల్ ప్రాంతంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన కరెస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రభుత్వ పథకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్న ఉప సర్పంచ్

- **చర్యలు తీసుకోవాలని పోలీసులకు, తహసిల్దార్ కు పిర్యాదు**

**మద్దూరు,అఖండ సూర్య**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల లోగోలను మారుస్తూ విష ప్రచారం చేస్తున్నారని మండలంలోని వల్లంపట్ల గ్రామ ఉపసర్పంచ్ మాచర్ల రఘు పై చర్యలు తీసుకోవాలని మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ, తన సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫోటోలు చేయూత పింఛన్ల లోగోను, ఆసరా పెన్షన్ పథకాలు. స్మార్ట్ రేషన్ కార్డు ప్రారంభం లోగోలు, సీఎం ఫోటో తీసేసి. ఉప సర్పంచ్ మాచర్ల రఘు ఫోటో పెట్టుకుని ప్రభుత్వ పథకాల ప్రచార పత్రాలలో ఫోటోలు మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు చెట్కూరి శ్రీశైలం, చింతల పాపిరెడ్డి, చింతల కరుణాకర్ రెడ్డి , వేల్పుల రాజు యాదవ్, పోగుల హరీష్ ,వంగపల్లి యాదగిరి, కొత్త దినేష్, ఇప్పల మల్లేశం, తదితరులు ఉన్నారు.



## అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

**సిద్దిపేట, అఖండ సూర్య:**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీల్లో అవార్డులు పొందిన ఫొటోజర్నలిస్టులు కె. సతీష్, ఎం. భాస్కర్ రెడ్డిలను 19వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు జువ్వన్న ప్రసాద్ ఘనంగా సన్మానించారు.

పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా జువ్వన్న ప్రసాద్ మాట్లాడుతూ.. వార్తా సంఘటనలను తమ కెమెరా కంటితో అద్భుతంగా ఆవిష్కరిస్తూ, సంఘటనల వెనుక ఉన్న భావోద్వేగాలు, సామాజిక పరిస్థితులను ఫొటోల రూపంలో ప్రజలకు చేరవేయడంలో సతీష్, భాస్కర్ రెడ్డిలు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.

ఫొటోజర్నలిస్టుల ప్రతిభను గుర్తించి సన్మానించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, కిట్టు, మల్లేశం, శ్రీనివాస్, బాలరాజు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం తడకపల్లి పాఠశాలలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం వేడుకలు.

- **అధిక సంఖ్యలో పాల్గొన్న మాతృ మూర్తులు**

**సిద్దిపేట అఖండ సూర్య**

శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీరామాశ్రమం తడకపల్లి పాఠశాలలో శ్రావణ 2వ శుక్రవారాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీ అమ్మవారికి వ్రతం నిర్వహించడం జరిగింది. దీనిలో పరిసర గ్రామాల మహిళలు మరియు పోషకులు అధిక సంఖ్యలో పాల్గొని (50మంది) అమ్మవారి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాంబశివరావు గారు వరలక్ష్మీ వ్రతం యొక్క విశిష్టతను తెలియజేశారు.పాఠశాల అధ్యక్షులు శ్రీ కొమురవెల్లి శేఖరం గారు మాట్లాడుతూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రతి సంవత్సరం వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని ఎంతో వైశిష్ట్యంగా నిర్వహిస్తుందని దీనిలో అనేకమంది మాతృ మూర్తులని భాగస్వాములను చేస్తూ అమ్మ ఒడి పిల్లలను క్రమశిక్షణ యుతంగా తయారు చేయడంలో ఎలాంటి పాత్రను పోషిస్తుందో చిన్నప్పటినుండి తమ పిల్లలను ఒక శివాజీలా తయారు చేయడానికి కృషి చేసిన జిజియా మాత అటువంటి మాతృమూర్తి ప్రతి ఇంటి నుండి తయారు కావాలని ప్రతీ ఇంట్లో స్త్రీ శక్తి జాగృతం కావాలని సమాజ హితం కోసం ఆ శక్తి పనిచేయాలని తెలియజేశారు. పాఠశాల కార్యదర్శి శ్రీ మంతపురి నారాయణ గారు మాట్లాడుతూ విద్యాపీఠం ప్రతి సంవత్సరం రెండు రకాల కార్యక్రమాలు చేస్తుంది ఒకటి సమాజాన్ని పాఠశాలల్లోకి తీసుకురావడం రెండు పాఠశాలను సమాజంలోకి తీసుకెళ్లడం వరలక్ష్మి వ్రతం మరియు వసంత పంచమి లాంటి కార్యక్రమాలు సమాజాన్ని పాఠశాలలోకి తీసుకొస్తాయి. రక్షాబంధన్ లాంటి కార్యక్రమాలు పాఠశాలను సమాజంవద్దకు తీసుకెళ్లి సమాజ స్థితిగతులనూ, అందరూ సమానమే అనే భావనను తెలియజేస్తూ ప్రతీ ఒక్కరికి రక్ష కడుతూ అలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటారు కార్యక్రమ ఉద్దేశం సమాజాన్ని ఏకం చేయడం సమాజాభివృద్ధి కోసం ఆలోచింపజేసేలా ప్రతీ పౌరున్ని ప్రోత్సహించడమే విద్యాపీఠ లక్ష్యమని తెలియజేశారు. ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేశారు.



## నూతన చేయూత పింఛన్ల కొరకు లబ్ధిదారు దరఖాస్తులు చేసుకోవాలి.

- **సమస్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు...**
- **8008556112 చేయూత పెన్షన్లు హెల్ప్ డెస్క్ నెంబర్....**
- **ఈ నెల 26 న దివ్యాంగులకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రత్యేక యు. డి.ఐ.డి శిబిరం...**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ఆగస్టు 21 (అఖండ సూర్య )**





చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు, అలాగే ఈ నెల 26 న దివ్యాంగుల కొరకు ప్రత్యేక యు డి ఐ డి శిబిరం నిర్వహిస్తున్నట్లు చేయూత పింఛన్ల దరఖాస్తులు మండల మరియు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ పై జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ కొత్త చేయూత పింఛన్లు దరఖాస్తులు మండల మరియు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని , తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైన ఎడల వెంటనే దరఖాస్తుదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు. 8008556112 చేయూత పెన్షన్లు హెల్ప్ డెస్క్ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఇంకా ఎవరైనా దివ్యాంగులు యూ డి ఐ డి ధ్రువీకరణ పత్రం లేనియెడల వారు తక్షణమే మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకున్న ఎడల ఆగస్టు 26వ తేదీన మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇంకా మిగిలి ఉన్న వారు మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఏదైనా ధృవీకరణ పత్రం లేనియెడల వెంటనే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లి తక్షణమే తీసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకునేటప్పుడు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కలెక్టరేట్లో ఉన్న హెల్ప్ డెస్క్ సహాయకారిణిగా పని చేస్తుందని, సమస్య ఉన్నట్లయితే వెంటనే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు. అర్హులైన వారు చేయూత పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని వీరికి ప్రభుత్వ యంత్రాంగం సహాయకారిణిగా పనిచేస్తుందన్నారు. లబ్ధిదారుల చేసుకున్న దరఖాస్తులను సకాలంలో తీసుకొని వెంటనే ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సంబంధిత ఎంపీడీఓ లను కలెక్టర్ ఆదేశించారు.




## 22ఏ భూముల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- **మెదక్ జిల్లా కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతి**

**మెదక్ ఆగస్టు 21 (అఖండ సూర్య )**



జిల్లాలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన తప్పిదాలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ ను కలిసి పలు డిమాండ్లను వివరించారు. ఈ సందర్భంగా రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22ఏ నిషేధిత భూముల జాబితాలో తప్పిదాలు జరిగినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంగీకరించిన నేపథ్యంలో మెదక్ జిల్లాలోనూ ఈ అంశంపై సమగ్ర విచారణ అవసరమన్నారు. 22ఏ జాబితాలో భారీగా భూములు చేరడం వెనుక కుట్ర ఉందంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ జాబితాలో ఉన్న భూముల వివరాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా చేర్చిన భూముల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మండలం, గ్రామం, సర్వే నంబర్ వారీగా 22ఏ జాబితా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటివరకు జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని, ధరణి, భూ భారతి తదితర డిజిటల్ భూ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని అన్నారు. తప్పుగా 22ఏ జాబితాలో చేర్చిన భూములను గుర్తించి బాధిత భూయజమానులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమ చేర్పులకు బాధ్యులైన అధికారులు, సిబ్బంది, మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి, అవినీతి లేదా అక్రమ ఆర్థిక లబ్ధికి సంబంధించిన ఆధారాలు లభిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 22ఏ భూములపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు స్వతంత్ర న్యాయ విచారణ లేదా సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. అలాగే 22ఏ జాబితాలో జరిగిన తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు అనుమానాస్పదంగా జరిగిన కొత్త చేర్పులు, మార్పులను పరిశీలించి భూ రికార్డుల భద్రతకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ మంత్రి కుటుంబ కంపెనీకి ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి ఆస్తుల బదిలీ జరిగిందన్న ఆరోపణలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెల్మకన్నె రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, సీనియర్ నాయకులు సుభాష్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి మల్లారెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్, గిరిజన మోర్చా అధ్యక్షులు రాములు నాయక్, మైనారిటీ మోర్చా అధ్యక్షులు జ్ఞాన్ సింగ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు బాల్‌రాజ్, జిల్లా నాయకులు లోకేష్, అల్లం మధు తదితరులు పాల్గొన్నారు.

## రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత

- **పిల్లల భవిష్యత్తు కోసం రూ.4.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్**

**బోనకల్, అఖండ సూర్య:**

బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రిపోర్టర్ మంద సత్యానందం ఇటివల రోడ్ ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే,ఈ నేపథ్యంలో వారి కుటుంబానికి యూటీఎఫ్ జిల్లా నాయకుడు వల్లంకొండ రాంబాబు ఆధ్వర్యంలో "సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత" అని మిత్రులందరితో గ్రూప్ ఏర్పాటు చేసి వారి కుటుంబానికి, ముగ్గురు పిల్లలకు ఆర్థిక సహాయం చేయాలని పిలుపునిస్తే స్పందించి సుమారు 200 మంది రూ.4,52,000 సేకరించారు.ఈ సందర్భంగా శుక్రవారం లక్ష్మీపురం సొసైటీలో వారి పిల్లల పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను కుటుంబసభ్యులకు సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు,సర్పంచ్ మంద కరుణ, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య,యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు అందించిన ఆర్థిక సహాయాన్ని పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం అని,దాతల నుంచి సేకరించిన సుమారు రూ.4.50 లక్షల మొత్తాన్ని పిల్లల చదువుల నిమిత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరిగింది అని పేర్కొన్నారు. రిపోర్టర్ సత్యానందం అకాల మరణంతో ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కుటుంబానికి అండగా నిలిచేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించిన నేపథ్యంలో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యానందం కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న దాతలు మానవతా దృక్పథంతో అందించిన సహాయాన్ని మాత్రమే కాకుండా, ఆయన పిల్లల భవిష్యత్తుకు భరోసాగా ఉండేలా వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు..సత్యానందం కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్క దాతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ఒక కుటుంబానికి మిత్రులు అందరూ అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సత్యానందం కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు మా తరుపున అందిస్తామని వారు అన్నారు.సత్యానందం పిల్లల చదువులకు భరోసాగా నిలిచేలా రూ.4.50 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం ద్వారా దాతలు అందించిన ఆర్థిక సహాయానికి ఒక సార్థకమైన ప్రయోజనం కలిగిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లంకొండ సురేష్,కొమ్ము శ్రీనివాసరావు, ఇరుగు జానేష్, తమ్మారపు లక్ష్మణరావు,పసుపులేటి వెంకటేశ్వర్లు,ఎర్రబోయిన అప్పారావు, నల్లమోతు నాగేశ్వరరావు, ముత్తరపు రవి, మంద జాన్, కల్యాణపు కిరణ్ పాల్గొన్నారు.



## 30 ఏళ్ల నుంచే గుండె సమస్యలు.. జాగ్రత్తలు తప్పనిసరి

- **సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శశి శ్రీవాత్సవ్...**

**మెదక్ ఆగస్టు 21 (అఖండ సూర్య )**





మెదక్ ప్రెస్ క్లబ్ లో యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శశి శ్రీవాత్సవ గుండె సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలతో గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శశి శ్రీవాత్సవ్ తెలిపారు. గతంలో సాధారణంగా 60 ఏళ్ల తర్వాత కనిపించే గుండె సమస్యలు ప్రస్తుతం 30 ఏళ్ల వయసు నుంచే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గుండె ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఒకే చోట ఎక్కువసేపు కూర్చోవడం, నడక లేకపోవడం, అధిక ఉప్పు తీసుకోవడం, మానసిక ఒత్తిడి, బీపీ, షుగర్‌ను నియంత్రించుకోకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం వంటి అంశాలు గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. రోజువారీ ఆహారంలో ఉప్పు పరిమాణాన్ని నియంత్రించుకోవాలని, అధికంగా మటన్ తీసుకోవడం తగ్గించి చేపలు, గుడ్లు, చికెన్ వంటి ఆహారాలను మితంగా తీసుకోవడం మంచిదని సూచించారు. రోజుకు తగినంత నిద్ర పొందడంతో పాటు, క్రమం తప్పకుండా నడక, శారీరక వ్యాయామం చేయాలని చెప్పారు.గుండెకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించేందుకు అవసరాన్ని బట్టి వైద్యుల సూచన మేరకు సీటీ స్కాన్ వంటి ఆధునిక పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పుట్టుకతో గుండెలో ఏర్పడిన కొన్ని రకాల రంధ్రాలను కూడా ఆధునిక వైద్య సాంకేతిక పరిజ్ఞానంతో ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా చికిత్స చేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రజలకు గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శశి శ్రీవాత్సవ్ తెలిపారు. వ్యాయామాన్ని ప్రారంభించే ముందు, ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా ప్రమాద కారకాలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు.



## జనసేన ఎంపీ లింగమనేని కుమారుడి కేసులో కీలక పరిణామం

**అఖండ సూర్య**




హైదరాబాద్‌లోని సైబరాబాద్ ప్రాంతంలో ఇనార్బిట్ మాల్ ఉద్యోగిని భారతి మృతి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే కేసులో పోలీసుల శరవేగంగా విచారణ కొనసాగిస్తున్నారు. జనసేన ఎంపీ లింగమనేని కుమారుడు సంజూష్ ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్నారు. దీంతో మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో తమ ఎదుట హాజరుకావాలని పోలీసులు ఇప్పటికే సంజూష్‌ను ఆదేశించారు.

అయితే సంజూష్ ఈ రోజు ఉదయం నుంచి విచారణకు హాజరుకాలేదు. దీంతో ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై అధికారులు సమీక్షిస్తున్నారు. మరోవైపు సంజూష్ పాత్రపై స్పష్టత రావాల్సి ఉండటంతో అతని స్టేట్‌మెంట్ ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారనుంది. ఈ కేసుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కేసు పూర్వాపరాలు, దర్యాప్తు పురోగతి, కీలక వివరాలను ఆయన వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

అఖండ సూర్య
GENERAL
శనివారం
22–08–2026
విజయవాడ



## ముడతలు,వలయాలు ఇలా తొలగిద్దాం



వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు, కండ్ల కింద వలయాలు అందాన్ని దూరం చేస్తాయి. ఈ ముడతలు, వలయాలను గోరు వెచ్చని నీళ్లు తరిమికొడతాయి. వెడల్పాటి గిన్నెలో గోరువెచ్చని నీళ్లు పోసి.. అందులో 20 సెకండ్ల పాటు ముఖాన్ని ఉంచండి. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయితే, పదేసి సెకండ్ల చొప్పున రెండు, మూడుసార్లు ముఖం అంతా మునిగేలా తలను నీళ్లలో ఉంచాలి. తర్వాత మెత్తటి వస్త్రంతో ముఖాన్ని తుడుచుకోవాలి. గోరువెచ్చని నీళ్లతో ముఖం కడగడం వల్ల చర్మం తాజాగా మారి ముడతలు తగ్గుముఖం పడతాయి. మొటిమలు, మచ్చలు కూడాతగ్గతాయి. రక్తప్రసరణ మెరుగై చర్మం మెరుస్తుంది. గోరువెచ్చని నీళ్లు చర్మంపై ఉండే మృతకణాలను తొలగిస్తాయి. దుమ్ము, ధూళి, మేకప్ వల్ల మూసుకుపోయిన స్వేదరంధ్రాలను తెరుస్తాయి. ఫలితంగా చర్మానికి మంచి నిగారింపు వస్తుంది



# ఏడుపూ మంచిదే..!

ఏడుపుకు మనిషికి అవినావ సంబంధం ఉంటుంది. పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకు మనిషికి కన్నీళ్లు తోడుగా ఉంటాయి. కష్టాలు, కన్నీళ్లు కామన్ గా వస్తూ ఉంటాయి. బాగా సంతోషం కలిగినా కన్నీళ్లే వస్తాయి. .. విపరీతమైన బాధలోనూ దు:ఖం పొంగివస్తుంది. అయితే కన్నీరంతా దు:ఖమేమీ కాదు. ఉల్లిపాయలు కోసేటప్పుడు కూడా కన్నీళ్లు వస్తాయి.. అలా అని ఏడుస్తున్నట్లు దాని అర్థం కాదు కదా.

అయితే కొన్ని సందర్భాలలో ఇంట్లో ఎవరైనా ఏడుస్తుంటే ఏడువు ఏం నష్టం లేదు అని అంటుండటం మనం వింటుంటాం. పెద్దలు ఆ మాట ఊరికే అనలేదండోయ్. ఏడువు వల్ల చాలా ప్రయోజనాలే ఉన్నాయండి. అందుకే ఎంత ఏడిస్తే అంత మంచిది అని అంటుంటారు మన పెద్దలు. సహజంగా ఏడుపు వచ్చేస్తేనే ఏడుపు వల్ల లభించే ప్రయోజనాలను పొందగలుగుతాము. ఏడుపు వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే ఇటీవల కొంతకాలంగా లాఫింగ్ క్లబ్ ల మాదిరిగా క్రయింగ్ క్లబ్ లు కూడా వచ్చేస్తున్నాయి. అయితే అసలు ఏడుపు వల్ల ఏం ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు చూడండి.

ఏడుపు వల్ల ప్రయోజనాలివే

ఏదైనా గాయం జరిగినప్పుడు నొప్పి తట్టుకోలేక గట్టిగా ఏడ్చేస్తుంటాం. ఇదీ ఒకందుకు మంచిదేనట. కన్నీళ్లలో ఒకరకమైన పెయిన్ కిల్లర్ ఉంటుందట. బాగా ఏడ్చిన తర్వాత నొప్పి తగ్గినట్లు అనిపించడానికి ఇదే కారణం.

ఏడుపు చర్మ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా? ఏడ్చే సమయంలో మొఖంలో రక్త ప్రసరణ పెరిగి చర్మానికి కొత్త నిగారింపు వస్తుంది.

మనసారా ఏడ్చినప్పుడు మనసులోని చేదు జ్ఞాపకాలు మసకబారిపోతున్న ఫీలింగ్ వస్తుంది.

కన్నీళ్లతో పాటు కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ కూడా బయటకి వెళ్లిపోతుంది. అందువల్ల బాగా ఏడ్చిన తర్వాత మనసు తేలికపడుతుంది.

ఏడ్చినప్పుడు కన్నీళ్లు వస్తాయి. కన్నీళ్లు మన కళ్లను పొడిబారనీయవు. బైక్ కు ఇంజిన్ ఆయిల్ ఎలా పనిచేస్తుందో కళ్లకు సహజసిద్ధమైన లూబ్రికెంట్స్ ఇవి. ఎక్కువగా సంతోషంగా ఉంటే మనసారా నవ్వుతాం. ఓ అంచనా ప్రకారం మనసారా నవ్వినప్పుడు 1.3 క్యాలరీలు కరిగిపోతాయి..మనసారా ఏడ్చినప్పుడు కూడా అంతే క్యాలరీలు కరిగిపోతాయంట.

# ధనియాలతో ఇన్ని లాభాలున్నాయా?



**మనం ఇంట్లో ఉపయోగించే ఆహార దినుసులలో ధనియాలు ఒకటి. వంటల్లో ధనియాలకు ఉండే ప్రాముఖ్యత అంతా కాదు. ధనియాలు అనేక అనారోగ్య సమస్యలకు మంచి దివ్య ఔషధంలా పనిచేస్తాయి. మన శరీరానికి కావలసిన ఆరోగ్య ప్రయోజనాలను ధనియాలు ఇస్తాయి. ఇక ధనియాలు మనకు ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలను గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం.**

**మధుమేహం కంట్రోల్ చేసుకోవచ్చు..!**




ధనియాలు మధుమేహాన్ని నివారించడానికి అద్భుతంగా పనిచేస్తాయి. మధుమేహం రాకుండా ధనియాలు కాపాడుతాయి. ధనియాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ ను నియంత్రించడానికి ధనియాల పొడిని ఒక గ్లాసు నీళ్లల్లో మరిగించి చల్లార్చి తీసుకుంటే ఎంతో బాగా పనిచేస్తుంది.

**లివర్ ఆరోగ్యం**

ధనియాలు రోజు తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. ధనియాలు మన లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. అనేక చర్మ సమస్యలను తగ్గించడంలో ధనియాలు కీలకంగా పనిచేస్తాయి. గజ్జి, దురదలు, దద్దుర్లు, వాపులు వంటి వాటిని ధనియాలు తగ్గిస్తాయి.



**ధనియాలతో కొలెస్ట్రాల్ కు చెక్**

అధిక బరువుతో బాధపడేవారు ధనియాల నీళ్లను తాగడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. రక్తంలో కొలెస్ట్రాల్ అధికంగా ఉంటే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ను తగ్గించడానికి ధనియాలు ఎంతో బాగా ఉపయోగపడతాయి. పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పిని తగ్గించడానికి కూడా ధనియాలు ఉపయోగపడతాయి.




**నార్మల్ పీరియడ్స్ కోసం..**

రక్తస్రావం అధికంగా అవుతున్నవారు ధనియాల నీళ్లను మరిగించి తేనె లేదా పటిక బెల్లం కలుపుకుని తాగితే రక్తస్రావం తగ్గి పీరియడ్స్ నార్మల్ గా వచ్చే అవకాశం ఉంటుంది. ధనియాలు మన శరీరంలోని ఫ్రీ రాడికల్స్ ని ఎదుర్కోవడానికి ఎంతో బాగా ఉపయోగపడతాయి. మన శరీర ఆరోగ్యానికి మాత్రమే కాకుండా చర్మ సౌందర్యానికి



కూడా ధనియాలు ఉపయోగపడతాయి.

**జీర్ణవ్యవస్థకు మేలు**

ధనియాలు మన జీర్ణవ్యవస్థను కాపాడతాయి. ధనియాలు మన బరువు తగ్గడానికి ప్రధానంగా దోహదం చేస్తాయి. ధనియాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అందుకు తగినట్టు మనం ఆహారంలో భాగం చేసుకోవాలి. ఆరోగ్యానికి ధనియాలు నిజంగా వరం అని చెప్పాలి.





# నిద్రతోనే మానసిక ఆరోగ్యం



నిద్ర మన శరీరానికి, మానసిక ఆరోగ్యానికి ఎంతో కీలకమైంది. కాగా నిద్ర తగ్గినా, అస్సలు లేకపోయినా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. సరైన నిద్ర అనేది శారీరక మానసిక సమస్యలను పరిష్కరిస్తుంది. మన ఆహారపు అలవాట్లు, నిద్ర మన శారీరక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి.

అదే విధంగా మన మానసిక ఆరోగ్యం కూడా చాలా ఎక్కువగా ప్రభావితమవుతుంది. నిద్ర మన మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఒత్తిడి మరింతగా పెరిగి డిప్రెషన్ బారీన పడాల్సి వస్తుంది. దీని కారణంగా మానసిక సమస్యలు తలెత్తి జ్ఞాపక శక్తి తగ్గుతుందని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

సుదీర్ఘకాలం నిద్ర లేకపోవడం వల్ల ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని సైకియాట్రిస్ట్ లు వెల్లడిస్తున్నారు. ఇది పలు సమస్యలకు తగిన పరిష్కారాలకు సరైన నిర్ణయం తీసుకోలేకపోవడంపై కూడా ప్రభావం చూపుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది.

నిద్ర సరిపోకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు కారణం అవుతుంది. అటువంటి పరిస్థితులలో, మానసికంగా దృఢంగా ఉండటానికి, మానసిక స్థితి నియంత్రణకు ప్రతిరోజు ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్ర అవసరం అని మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఇది మెదడు పనితీరుకు మద్దతు ఇవ్వడం, రోజువారీ ఒత్తిడిని తొలగించడానికి ,మానసిక ప్రశాంతతను మెరుగుపరచడమేకాకుండా, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

తద్వారా మానసికంగా హెల్తీగా ఉండొచ్చు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత నిద్ర అవసరమని వైద్యులు చెబుతున్నారు. మనం నిద్రపోతున్నప్పుడు, మన మెదడుకు జ్ఞాపకాలను నిల్వచేసుకోవడానికి, భావోద్వేగాలను ప్రాసెస్ చేయడానికి కోలుకోవడానికి అవకాశం ఉంటుంది.

నిద్ర లేకపోవడంఅనేది నిద్ర ఈ ప్రక్రియలకు అంతరాయం కలిగిస్తుంది. దీని కారణంగా దేని మీద శ్రద్ధ పెట్టలేరు.



# 'బ్రహ్మాస్త్ర 2'లో దీపిక?



ఓవైపు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. తన రాబోయే సినిమా చిత్రీకరణలతో బిజీగా గడుపుతోంది బాలీవుడ్ నాయిక దీపికా పదుకొణె. ఇప్పుడామె ఖాతాలో ఓ కొత్త చిత్రం చేరినట్లు తెలుస్తోంది. ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. దీనికి సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. హిందీ హీరో రణ్‌బీర్ కపూర్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో సందడి చేయనుందట దీపిక.

"బ్రహ్మాస్త్ర 2' స్క్రిప్ట్ పనులు ముగింపు దశకి వచ్చాయి. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ కొనసాగింపు చిత్ర షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. ఇందులో అమృత అనే శక్తిమంతమైన పాత్ర కోసం దర్శకుడు దీపికతో చర్చలు చేస్తున్నారు. ఈ పాత్రకు అపారమైన గంభీరత ఉన్న నటి అవసరమని.. దీపిక అయితేనే దీనికి సరిగ్గా సరిపోతుందని చిత్రబృందం భావిస్తోంది. త్వరలో ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయ"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

# ఇన్‌స్టా రీల్స్‌తో 'ఇరుముడి' అవకాశం!

"నా తొలి తెలుగు సినిమా 'ఇరుముడి' కావడం... స్నేహంగా మెలిగే రవితేజ, ప్రియా భవానీ శంకర్‌తో కలిసి ఇందులో నటించడం ఎంతో సంతోషాన్నిచ్చింది" అని చెప్పింది బేబి నక్షత్ర. ఏడో తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఓ కీలక పాత్ర పోషించిన చిత్రం 'ఇరుముడి'. రవితేజ, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించారు. శివ నిర్వాణ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మించారు. ఈ రోజే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది నక్షత్ర. "ఇప్పటి వరకూ ఆరు సినిమాలు చేశా. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ ఇలా భిన్న భాషలు, సంస్కృతిని అర్థం చేసుకుంటూ ఈ సినిమాలు చేయడం మంచి అనుభవం. ఇన్‌స్టాలో నేను చేసిన రీల్స్ చూసే దర్శకుడు శివ నిర్వాణ నాకు 'ఇరుముడి' సినిమాలో నటించే అవకాశం ఇచ్చారు. ఇందులో మణికంఠ అనే అమ్మాయిగా కనిపిస్తాను. రవితేజకు కూతురిగా కనిపించే పాత్ర అది. ప్రియ భవానీ శంకర్ నాకు తల్లిగా నటించారు. వాళ్లిద్దరూ ఎంతో స్నేహంగా మెలగడం, దర్శకుడు శివ నిర్వాణ సహకారంతో ఆడుతూ పాడుతూ చిత్రీకరణ పూర్తి చేశా. తెలుగు భాష నాకు అర్థం అవుతోంది. అందుకే నా పాత్రకి స్వయంగా డబ్బింగ్ చెప్పా. సీలేరులో చిత్రీకరణ కావడంతో నాకు ఆ ప్రాంతమంతా కేరళలాగే అనిపించింది. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే సినిమాలు చేయగలుగుతున్నా. ఇప్పటివరకూ నా సినీ ప్రయాణంలో పృథ్వీరాజ్ సుకుమారన్, శివరాజ్ కుమార్, రవితేజలాంటి అగ్ర హీరోలతో సినిమాలు చేయడం చాలా బాగుంది. మైత్రీ సంస్థలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా" అని చెప్పింది నక్షత్ర.



# సొసైటికి తప్పు మెసేజ్ ఇవ్వను..



లవర్ బాయ్‌గా ఫుల్ పాపులారిటీ దక్కించుకున్న సిద్ధార్థ్ నటించిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' అనే కొత్త వెబ్ సిరీస్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సిరీస్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న సమయంలోనే ఆయన.. తాజాగా ఐటెమ్ పాటల సంస్కృతిపై తన పాత్రల ఎంపికపై చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. నటుడిగా తనకు కొన్ని సొంత నీతులు, పద్ధతులు ఉన్నాయని చెబుతున్నారు సిద్ధార్థ్. అందుకే సమాజానికి చెడు సందేశాన్ని ఇచ్చే ఐటెమ్ పాటల్లో ఎప్పటికీ నటించనని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఒక మహిళ చుట్టూ 40 మంది పురుషులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే పాటల్లో తాను నటించలేదని, అలాంటి సంస్కృతిని ప్రోత్సహించడం తన విధానం కాదని తెలిపారు. అంతేకాకుండా, తాను ఎల్లప్పుడూ కేవలం హీరో పాత్రలకే పరిమితం కావాలని అనుకోవడం లేదని వెల్లడించారు. ఒకవేళ హీరో పాత్రలోనే విపరీతమైన చెడు లక్షణాలు ఉంటే అలాంటి కథలను ఒప్పుకోనని తెలిపారు. కథ డిమాండ్ చేస్తే, సినిమాలో చివరికి నాశనమయ్యే క్రూరమైన విలన్ పాత్రలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. నటుడిగా సమాజానికి సరైన సందేశం ఇవ్వడమే తన మొదటి ప్రాధాన్యమని.. కానీ సొసైటికి తప్పు మెసేజ్‌ను ఇవ్వనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి.

# డైరెక్టర్ మాత్రమే కాదు హీరోగానూ సెన్సేషన్..



కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ హీరోగా నటించిన లేటెస్ట్ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'డీసీ'. విలక్షణ చిత్రాల దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో లోకేష్ కనగరాజ్ సరసన అందాల భామ వామికా గబ్బి హీరోయిన్‌గా నటించారు. సౌత్ ఇండియాలోనే అగ్ర నిర్మాణ సంస్థ అయిన సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. భారీ అంచనాల నడుమ ఆగస్టు 7న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా, విడుదలైన మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌తో, బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌తో థియేటర్లలో విపరీతమైన రచ్చ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం, తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టి అరుదైన చరిత్ర సృష్టించింది.

సాధారణంగా దర్శకులు నటులుగా మారిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఒక స్టార్ డైరెక్టర్ హీరోగా మారి తన మొదటి సినిమాతోనే ఏకంగా రూ.100 కోట్ల మైలురాయిని చేరుకోవడం విశేషం. ఈ గ్రాండ్ సక్సెస్‌ను ఘనంగా వేడుక చేసుకుంటూ మేకర్స్ ఒక మాస్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో లోకేష్ కనగరాజ్ చేతిలో గన్ పట్టుకుని శత్రువులకు గురిపెట్టిన పవర్‌ఫుల్ లుక్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో దేవదాస్ అనే పాత్రలో లోకేష్ కనగరాజ్ నటించారు. డైరెక్టర్‌గా ఎన్నో సంచలనాలు సృష్టించిన ఆయన, నటుడిగా కూడా మొదటి ప్రయత్నంలోనే తనదైన శైలిలో నటనను కనబరిచి విమర్శకుల ప్రశంసలు అందుకోవడం విశేషం. ఇక 'చంద్ర' పాత్రలో వామికా గబ్బి తన గ్లామర్ అండ్ యాక్టింగ్‌తో అలరించగా, మరో కీలక పాత్రలో నటించిన సంజనా కృష్ణమూర్తి పెర్ఫార్మెన్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇక రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది.



# నాపై బాధ్యత పెంచిన పోలిక అది

"కొన్నేళ్లుగా కుటుంబ కథలతో రూపొందే సినిమాలు బాగా తగ్గిపోయాయి. ఈ సమయంలో ఒక మంచి కుటుంబ చిత్రం వస్తే ప్రేక్షకులు థియేటర్లకు పోటెత్తుతారని బలంగా నమ్మా. 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో అదే నిజమైంది" అన్నారు వెంకీ అట్లూరి. ఆయన దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా తెరకెక్కిన సినిమానే 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు.

"ఒకప్పుడు అన్ని రకాల జానర్లలో సినిమాలు వచ్చేవి. కథానాయకుడు సూర్యకు అలా అన్ని రకాల సినిమాలు చేయడమంటేనే ఇష్టం. ఓ కుటుంబ కథ కోసం ఎదురు చూస్తున్నట్టు నాతో చెప్పారు. అప్పటికే నా దగ్గర 'విశ్వనాథ్ అండ్ సన్స్' కథ సిద్ధంగా ఉండటంతో వెంటనే వినిపించా. ఆయనకి బాగా నచ్చింది. అయితే, ఈ కథకు అనవసరమైన కామెడీ, కమర్షియల్ అంశాల్ని జోడించకుండా నిజాయతీగానే చెబుదామన్నారు. సూర్య కోసం రాయలేదు కానీ, ఆయనకు నచ్చిన తర్వాత తన స్టైల్‌కి తగ్గట్టుగాకొన్ని మార్పులు చేర్పులు చేసి రంగంలోకి దిగాం. సినిమా విడుదలకు కొద్దిరోజుల ముందు సూర్య సినిమాని చూసి, తాను ఏదైతే నమ్మానో అదే తెరపై కనిపించిందంటూ సంతృప్తిని వ్యక్తం చేశారు. సితార సంస్థలో రూపొందే సినిమాల నిర్మాణంలో భాగస్వామి కావడంతో దాదాపు అన్ని సినిమాలూ చూస్తుంటారు దర్శకుడు త్రివిక్రమ్. ఆయన కూడా ఈ సినిమా చూసి ఎలాంటి మార్పులు చెప్పకుండా చాలా బాగుందన్నారు. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి మా అంచనాలకు మించిన ఆదరణ లభిస్తోంది.

# 'టాక్సిక్' సెన్సార్.. కట్స్ లేకుండా 'ఏ' సర్టిఫికెట్!

యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' (Toxic) గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భారీ యాక్షన్ అండ్ రివేంజ్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్ రిపోర్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎలాంటి కట్స్ సూచించకుండా సెన్సార్ బోర్డు (CBFC) ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో రూపొందిన ఈ సినిమా నిడివి 3 గంటల 12 నిమిషాలు. కన్నడ వెర్షన్‌లో కేవలం రెండు పదాలను మ్యూట్ చేయడంతో పాటు పొగ తాగడం, మద్యానికి సంబంధించిన సన్నివేశాల్లో హెచ్చరిక లైన్‌ను జోడించాలని బోర్డు సూచించింది.

సాధారణంగా సినిమాల్లో హింసాత్మక సన్నివేశాలపై కఠినంగా వ్యవహరించే సెన్సార్ బోర్డు, ఇంతటి వైలెంట్ సినిమాకు ఒక్క సీన్ కూడా కట్ చేయకుండా అనుమతి ఇవ్వడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హాలీవుడ్ చిత్రాలైన 'స్పైడర్ మ్యాన్', 'సూపర్ మ్యాన్' సినిమాల్లో ముద్దు సన్నివేశాలపై ఆంక్షలు విధించే సెన్సార్ బోర్డు.. 'టాక్సిక్' లాంటి యాక్షన్ డ్రామాకు మాత్రం క్లియరెన్స్ ఇచ్చిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఇప్పటికే ఈ సినిమాపై యశ్ మాట్లాడుతూ.. ఇది పెద్దల కోసం మాత్రమే తీసిన చిత్రమని స్పష్టం చేశారు. ఈ చిత్రం అందరినీ ఆలోచింపచేస్తుందని అన్నారు. ఎంతో నిజాయతీగా దీన్ని రూపొందించినట్లు తెలిపారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ భారీ బడ్జెట్ చిత్రంలో నయనతార, కియారా, హుమా ఖురేషీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# ధనుష్ రాజకీయాల్లోకి వస్తే పూర్తి మద్దతు ఇస్తా





కోలీవుడ్ కథానాయకుడు ధనుష్ రాజకీయాల్లోకి రానున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ధనుష్ (Dhanush) తనకు మంచి స్నేహితుడని చెప్పిన ఆయన.. ఎప్పటికీ ధనుష్ వెంటే ఉంటానని అన్నారు. ''ధనుష్ నాకు చాలా మంచి స్నేహితుడు. ఏ నిర్ణయం తీసుకున్నా అతడి వెంటే ఉంటాను. ఒకవేళ రాజకీయాల్లోకి వచ్చినా అతడికి తప్పకుండా మద్దతు ఇస్తాను'' అని చెప్పారు.

**అభిమానులతో ముచ్చటించిన ధనుష్..**

ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఇటీవల ధనుష్ (Dhanush) తన అభిమానులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన 'ఓం' సినిమా షూటింగ్ సమయంలో అభిమానులతో ముచ్చటించారు. తమిళనాడులోని తిరువన్నామలై జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. దీని విరామ సమయంలో ధనుష్ అభిమానులతో మాట్లాడారు.

ఇటీవల ధనుష్ అభిమాన సంఘం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 'ఆల్ ఇండియా ధనుష్ ఫ్యాన్స్ అసోసియేషన్'.. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా పరిధిలో ఐదు నియోజకవర్గాల్లో కొత్త సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఫ్యాన్ క్లబ్ నాయకులు పిలుపునిచ్చారు. తాజాగా ఆయన అభిమానులతో ముచ్చటించడంతో రాజకీయాల్లోకి వచ్చేందుకు ఈ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారా అని విశ్లేషకులు భావిస్తున్నారు

This newspaper is published by Petta Venkata Suryanarayana from 3-88, Chandra Theatre, Main Road, Gosala, Krishna District, Andhra Pradesh – 521151. It is published on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana, and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises, 3-88, Chandra Theatre, Main Road, Gosala, Krishna District, Andhra Pradesh – 521151. E-mail: seshasai09@gmail.com,. Phone: 9618880945